ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 02 సంచిక -164 పేజీలు - 08 వెల - 04/- శనివారం 5 ఏప్రిల్ 2025

## రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్

**26 జిల్లాల్లోని ప్రధాన రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు**

**స్లాట్ విధానం ప్రారంభించిన మంత్రి అనగాని సత్యప్రసాద్**




2లో

## ప్రతి నియోజకవర్గానికి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి

**ఆరోగ్య శాఖపై సమీక్షలో చంద్రబాబు**

- 100 నుంచి 300 పడకలతో ఏర్పాటు
- పీపీపీ పద్ధతిలో నిర్మాణానికి చర్యలు
- గేట్స్ ఫౌండేషన్ సహకారంతో అత్యుత్తమ వైద్య సేవలు
- అమరావతిలో మెగా గ్లోబల్ మెడిసిటీ ప్రాజెక్టు ఏర్పాటు
- కొత్తగా 13 డ్రగ్ డీ-ఎడిక్షన్ సెంటర్లు



అమరావతి, ఏప్రిల్ 4, ఆంధ్ర ప్రగతి :
రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలోనూ 100 నుంచి 300 పడకల సామర్థ్యంతో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులు నిర్మించేలా కార్యాచరణ ప్రారంభించాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో వైద్యసేవల్ని మరింత విస్తృతం చేయాలని సూచించారు. మిగతాది 2లో...

## మద్యం స్కామ్ కేసులో కసిరెడ్డికి చుక్కెదురు

**పిటిషన్‌ను డిస్మిస్ చేసిన హైకోర్టు**



అమరావతి,ఏప్రిల్ 4, ఆంధ్ర ప్రగతి :
మద్యం స్కాం కేసులో సీఐడీ నోటీసులను సవాలు చేసిన కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డికి ఏపీ హైకోర్టులో చుక్కెదురైంది. సీఐడీ నోటీసులను సవాలు చేస్తూ కసిరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు డిస్మిస్ చేసింది. తొందర పాటు చర్యలు తీసుకోకుండా సీఐడీకి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వటానికి కూడా హైకోర్టు నిరాకరించింది. మిగతాది 2లో...

## ఆంధ్రప్రదేశ్ చేపడుతున్న ప్రాజెక్టులపై సుప్రీంకోర్టుకు వెళతాం

**: ఉత్తమ్ కుమార్ రెడ్డి**

నిబంధనలకు విరుద్ధంగా, ఏకపక్షంగా ప్రభుత్వం వెళుతోందని విమర్శ

రాయలసీమ ఎత్తిపోతల, బనకచర్లతో తెలంగాణకు నష్టంలపే తీరుతో సాగునీరు, తాగునీటికి ముప్పు ఏర్పడే ప్రమాదం ఉందని ఆందోళన



2లో

## సచివాలయంలో అగ్ని ప్రమాదం..

- ప్రమాదస్థలాన్ని పరిశీలించిన సీఎం చంద్రబాబు
- సచివాలయంలోని రెండో బ్లాక్‌లో అగ్ని ప్రమాదం
- బ్యాటరీలు ఉంచే ప్రాంతంలో చెలరేగిన మంటలు
- ప్రమాదంపై అధికారులను అడిగి తెలుసుకున్న సీఎం



2లో

## నా పోటీ సిఎం చంద్రబాబుతోనే

**ఆసక్తికర వ్యాఖ్యలు చేసిన లోకేశ్**

**రెండోరోజూ కొనసాగిన మనిల్లు కార్యక్రమం**

**పలువురు లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ**

అమరావతి,ఏప్రిల్ 4, ఆంధ్ర ప్రగతి : నా పోటీ ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే' అంటూ విద్య, ఐటీ–, ఎలక్ట్రానిక్స్ శాఖల నారా లోకేష్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు మన ఇల్లు – మన లోకేష్ కార్యక్రమంలో భాగంగా నీరుకొండ గ్రామానికి చెందిన 99 మందికి, రత్నాల చెరువుకు చెందిన 199 మందికి శాశ్వత ఇంటి పట్టాలను మంత్రి లోకేష్ పంపిణీ చేవారు. మంగళగిరి నియోజకవర్గం ఉండవల్లిలో మన ఇల్లు మన లోకేష్ కార్యక్రమంలో భాగంగా రెండో రోజు శాశ్వత ఇంటి పట్టాలను మంత్రి లోకేష్ అందజేశారు. మిగతాది 2లో...



## ఉత్తమ విద్యా వ్యవస్థ కోసం పాలసీ

**జీవన ప్రమాణాలు పెంచే విధంగా మన విద్యా విధానం ఉండాలి: రేవంత్ రెడ్డి**

**విద్యాశాఖ అధికారులకు ఆదేశం**



2లో

## ఏపీలో 38 మార్కెట్ కమిటీలకు చైర్మన్ల ప్రకటన

అమరావతి,ఏప్రిల్ 4, ఆంధ్ర ప్రగతి :
రాష్ట్రంలో నామినేటెడ్ పదవుల పంపకం కొనసాగుతోంది. ఇటీవల 47 మార్కెట్ కమిటీలకు ఛైర్మన్లను ప్రకటించగా, ఈరోజు మరో 38 కమిటీలకు ప్రభుత్వం నియామకాలు చేసింది. ఇందులో 31 టీడీపీకి, 6 జనసేనకు, ఒకటి బీజేపీకి దక్కింది. త్వరలోనే మిగతా కమిటీలకు ఛైర్మన్లను ప్రకటిస్తామని కూటమి ప్రభుత్వం వెల్లడించింది. కాగా, రాష్ట్రవ్యాప్తంగా 218 మార్కెట్ కమిటీలు ఉన్నాయి.

## వక్ఫ్ బిల్లుపై సుప్రీంకోర్టుకు కాంగ్రెస్, మజ్లిస్

**సుప్రీంకోర్టును ఆశ్రయించిన కాంగ్రెస్ ఎంపీ, మజ్లిస్ అధినేత అసదుద్దీన్**

**ఈ బిల్లు వక్ఫ్ ఆస్తులు, వాటి నిర్వహణపై ఏకపక్షంగా ఉందన్న ఎంపీలు**

**ముస్లిం సమాజానికి చెందిన మతపరమైన స్వయంప్రతిపత్తిని దెబ్బతీస్తుందని పేర్కొన్న ఎంపీలు**



2లో

## హిందువుల రక్షణపై దృష్టి పెట్టండి

**బంగ్లా నేతకు ప్రధాని మోడీ సూచన**

బ్యాంకాక్,ఏప్రిల్ 4, ఆంధ్ర ప్రగతి :బంగ్లాదేశ్‌లో హిందువుల రక్షణకు తక్షణ చర్యలు తీసుకోవాలని భారత్ కోరింది. ఈ మేరకు థాయిలాండ్ పర్యటనలో ఉన్న ప్రధాని మోడీ బంగ్లా తాత్కాలిక ప్రభుత్వాధినేత యూనస్‌తో భేటీలో నిర్మొహమాటంగా ఈ విషయం చెప్పారు. బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వాధినేతగా అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారి మహ్మద్ యూనస్, భారత ప్రధాని నరేంద్రమోడీతో భేటీ అయ్యారు. థాయ్‌లాండ్ బ్యాంకాక్‌లో 6వ బిమ్‌స్టెక్ శిఖరాగ్ర సమావేశంలో ఇరువురు నాయకులు సమావేశమయ్యారు. మిగతాది 2లో...



## వక్ఫ్ బిల్లుపై సుప్రీంకోర్టుకు కాంగ్రెస్, మజ్లిస్

(మొదటి పేజి తరువాయి)

వక్ఫ్ (సవరణ) బిల్లు-2025ను సవాల్ చేస్తూ కాంగ్రెస్, మజ్లిస్ పార్టీలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. పార్లమెంటు ఉభయ సభల్లో వక్ఫ్ (సవరణ) బిల్లు-2025 ఆమోదం పొందిన విషయం విదితమే. ఈ బిల్లును కాంగ్రెస్ ఎంపీ మహమ్మద్ జావేద్, మజ్లిస్ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఈ బిల్లు (సవరణ) లోని నిబంధనలు ముస్లిం సమాజం యొక్క ప్రాథమిక హక్కులను ఉల్లంఘించే విధంగా ఉన్నాయని వారు పిటిషన్‌లో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ బిల్లు వక్ఫ్ ఆస్తులు, వాటి నిర్వహణపై ఏకపక్షంగా ఉందని, ముస్లిం సమాజానికి చెందిన మతపరమైన స్వయంప్రతిపత్తిని దెబ్బతీస్తుందని పిటిషన్‌లో ఆరోపించారు. ఇదిలా ఉండగా, వక్ఫ్ (సవరణ) బిల్లు-2025 పార్లమెంటు ఉభయ సభల్లో ఆమోదం పొందిన నేపథ్యంలో కోల్‌కతా, చెన్నై, అహ్మదాబాద్‌లలోని పలు ప్రాంతాల్లో ముస్లింలు నిరసనలు తెలిపారు. శుక్రవారం ప్రార్థనల అనంతరం పెద్ద సంఖ్యలో వీధుల్లోకి వచ్చి ఆందోళనలు నిర్వహించారు.

## ఆంధ్రప్రదేశ్ చేపడుతున్న ప్రాజెక్టులపై సుప్రీంకోర్టుకు వెళతాం

ఏప్రిల్ 4, ఆంధ్ర ప్రగతి :

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న నీటి ప్రాజెక్టులపై సుప్రీంకోర్టుకు వెళతామని తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా, ఏకపక్షంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. రాయలసీమ ఎత్తిపోతల, బనకచర్ల ప్రాజెక్టుల వల్ల తెలంగాణకు నష్టం వాటిల్లుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేస్తామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైఖరితో తెలంగాణ రాష్ట్రంలో సాగునీరు, తాగునీటికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

సన్నబియ్యం పంపిణీ చరిత్రాత్మక నిర్ణయం

సన్నబియ్యం పంపిణీ ఒక చరిత్రాత్మక నిర్ణయమని ఉత్తమ్ కుమార్ రెడ్డి అభివర్ణించారు. ఈ పథకానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని ఆయన అన్నారు. దాదాపు 80 శాతం మంది పేదలు ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారని ఆయన పేర్కొన్నారు. లబ్ధిదారుల ఇళ్లలో ప్రజాప్రతినిధులు భోజనం చేయాలని ఆయన సూచించారు. శ్రీరామ నవమి రోజున భద్రాచలంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక లబ్ధిదారుడి నివాసంలో భోజనం చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. సన్నబియ్యం పంపిణీలో అవకతవకలకు ఏమాత్రం ఆస్కారం ఉండకూడదని ఆయన అధికారులను ఆదేశించారు.

## మద్యం స్కామ్ కేసులో కసిరెడ్డికి చుక్కెదురు

(మొదటి పేజి తరువాయి)

164 స్టేట్‌మెంట్ ఇవ్వటానికి వెళ్తే అరెస్టు చేసే అవకాశం ఉందని పిటిషనర్ తరపున న్యాయవాది వాదించారు. విచారణకు కొంత సమయం ఇవ్వాలని కోరటంతో ఆ దిశగా నోటీ-సులు జారీ చేయాలని సీఐడీని హైకోర్టు ఆదేశించింది. ఆంధ్రప్రదేశ్‌లో మద్యం కుంభకోణం వ్యవహారం పెద్ద దుమారం రేపిన విషయం తెలిసిందే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మద్యం కుంభకోణంలో తెర వెనుక లావాదేవీలను వెలుగులోకి తెచ్చేందుకు ప్రయత్నించింది. ఈ కుంభకోణంలో మొత్తం వ్యవహారాన్ని గత ప్రభుత్వంలో ఐటీ- సలహాదారుగా పనిచేసిన కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి తెర వెనుక ఉండి నడిపించారని ఆరోపణలు ఉన్నాయి. తాజాగా మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి కూడా ఆయన గురించి కామెంట్స్ చేయడం ఆ ఆరోపణలకు మరింత బలాన్ని చేకూర్చింది. వేల కోట్ల వ్యాపారంలో ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టారనే ఆరోపణలతో కసిరెడ్డిపై కేసులు నమోదు అయ్యాయి.

## సచివాలయంలో అగ్ని ప్రమాదం..

(మొదటి పేజి తరువాయి)

ఏపీ సచివాలయంలోని రెండో బ్లాక్‌లో శుక్రవారం ఉదయం అగ్నిప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. రెండో బ్లాక్‌లో బ్యాటరీలు ఉంచే ప్రాంతంలో అగ్ని ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ప్రమాదస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. అయితే, ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని సీఎం చంద్రబాబు నాయుడు పరిశీలించారు. అగ్ని ప్రమాదం ఎలా జరిగిందనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రమాదానికి గల కారణాలను ముఖ్యమంత్రికి సీఎస్ విజయానంద్, డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా, జీఏడీ సెక్రటరీ ముఖేశ్ కుమార్ మీనా, ఫైర్ డీజీ మాదిరెడ్డి ప్రతాప్ వివరించారు. ఈ సందర్భంగా ప్రమాదం ద్వారా జరిగిన ఆస్తి నష్టంపై అధికారుల వద్ద సీఎం ఆరా తీసినట్లు తెలుస్తోంది.

కాగా, సచివాలయంలోని రెండో బ్లాక్‌లోనే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, హోం మంత్రి వంగలపూడి అనిత, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, టూరిజం మంత్రి కందుల దుర్గేశ్, దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేషీలు ఉన్న విషయం తెలిసిందే. ద

## ఉత్తమ విద్యా వ్యవస్థ కోసం పాలసీ

(మొదటి పేజి తరువాయి)

జీవన ప్రమాణాలు పెంపొందించే విధంగా విద్యా విధానం ఉండాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. ఉత్తమ విద్యా వ్యవస్థ కోసం ఒక పాలసీని రూపొందించాలని విద్యాశాఖ అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. విద్యా కమిషన్, విద్యాశాఖపై ఆయన సమీక్ష నిర్వహించారు. క్షేత్రస్థాయి పరిస్థితులకు అనుగుణంగా, ఆచరణ సాధ్యమయ్యేలా పాలసీ ఉండాలని ఆయన అన్నారు. జీవన ప్రమాణాలు పెంచే విధంగా విద్యావిధానం ఉండాలని అధికారులకు సూచించారు. భాషతో పాటు, విద్యార్థుల్లో విషయ పరిజ్ఞానం పెంచేలా ఈ పాలసీ ఉండాలని అన్నారు. ఉత్తమ విద్యా వ్యవస్థ కోసం ఎంత ఖర్చైనా కాంగ్రెస్ ప్రభుత్వం వెనుకాడబోదని ఆయన స్పష్టం చేశారు.

## దశాబ్దాలుగా వక్ఫ్ వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం లోపించింది.

### -సామాజిక-ఆర్థిక న్యాయం, పారదర్శకత, సమ్మిళిత వృద్ధి కోసం సమిష్టి అన్వేషణలో ఒక కీలకమైన ఘట్టం.

### వక్ఫ్ బిల్లు ఆమోదంపై మోడీ కీలక వ్యాఖ్యలు.



ఆంధ్ర ప్రగతి న్యూఢిల్లీ ఏప్రిల్ 04:

పార్లమెంట్ ఉభయ సభల్లో వక్ఫ్ సవరణ బిల్లు ఆమోదం పొందడంపై ప్రధాని మోడీ స్పందించారు. సామాజిక మాధ్యమం వేదికగా స్పందిస్తూ.. ఇది కీలక పరిణామం అని పేర్కొన్నారు.

దశాబ్దాలుగా వక్ఫ్ వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం లోపించిందని పేర్కొన్నారు. తాజాగా బిల్లు ఆమోదంతో అట్టడుగున ఉన్న వర్గాలకు మేలు చేకూరుతుందని తెలిపారు. అంతేకాకుండా వారి గళం వినిపించే అవకాశం దక్కుతుందని చెప్పుకొచ్చారు. పార్లమెంట్ ఉభయ సభలు వక్ఫ్ (సవరణ) బిల్లు మరియు ముస్సల్మాన్ వక్ఫ్ (రద్దు) బిల్లును ఆమోదించడం కీలక పరిణామం. సామాజిక-ఆర్థిక న్యాయం, పారదర్శకత, సమ్మిళిత వృద్ధి కోసం సమిష్టి అన్వేషణలో ఒక కీలకమైన ఘట్టం. ముఖ్యంగా చాలా కాలంగా అట్టడుగున ఉన్న ప్రజలకు ఎంతగానో సహాయపడుతుంది అని మోడీ ట్వీట్ చేశారు. 12 గంటల పాటు చర్చ తర్వాత శుక్రవారం అర్ధరాత్రి దాటిన అనంతరం రాజ్యసభలో వక్ఫ్ సవరణ బిల్లు ఆమోదం పొందింది. బిల్లుకు అనుకూలంగా 128 ఓట్లు, వ్యతిరేకంగా 95 ఓట్లు పడ్డాయి. చర్చ సందర్భంగా ప్రతిపక్షాలు లోపాలు ఎత్తిచూపాయి. మొత్తానికి ఉభయ సభల్లో సులువుగానే బిల్లు ఆమోదం పొందడం విశేషం. ఇక ఈ బిల్లును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దగ్గరకు వెళ్లనుంది. రాష్ట్రపతి ఆమోద ముద్ర వేస్తే.. చట్టం అమల్లోకి రానుంది. వక్ఫ్ బిల్లుపై బుధవారం లోక్‌సభలో 14 గంటలకు పైగా చర్చ జరిగింది. అనంతరం స్పీకర్ ఓం బిర్లా ఓటింగ్ నిర్వహించారు. బిల్లుకు అనుకూలంగా 288 మంది, వ్యతిరేకంగా 232 మంది సభ్యులు ఓటేశారు. ఇక ఈ బిల్లు ముస్లింల ప్రయోజనాలకు హాని కలిగిస్తుందనే ఆరోపణలను మైనార్టీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తోసిపుచ్చారు. ఈ బిల్లుతో ముస్లింలకే లాభమని.. బిల్లు ఆమోదంతో ముస్లిమేతరులు ఈ వ్యవహారాల్లో జోక్యం చేసుకోలేరని పేర్కొన్నారు. అయినా ఈ బిల్లు మతానికి సంబంధించింది కాదని.. ఆస్తి, దాని నిర్వహణకు, అవినీతిని నిర్మూలించడమే ఈ బిల్లు లక్ష్యమని తెలిపారు.

# రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 'స్లాట్ బుకింగ్' విధానం

అమరావతి,ఏప్రిల్ 4, ఆంధ్ర ప్రగతి :

ఆంధ్రప్రదేశ్‌లోని రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 'స్లాట్ బుకింగ్' విధానం ప్రారంభం అయింది. స్లాట్ బుకింగ్ విధానాన్ని మంత్రి అనగాని సత్యప్రసాద్ శుక్రవారం ఉదయం సచివాలయంలో ప్రారంభించారు. తొలి విడతలో భాగంగా రాష్ట్రంలోని 26 జిల్లాల్లోని ప్రధాన రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. మిగిలిన రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఏప్రిల్ చివరి లోగా దశలవారీగా ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా మంత్రి సత్యప్రసాద్ మాట్లాడుతూ.. వ్యాపారులు, ప్రజల శ్రేయస్సు దృష్ట్యా కీలక నిర్ణయాలు తీసుకుంటున్నామని చెప్పారు. పరిపాలనా విధి విధానాలు అందరికి అందుబాటు-లో ఉండాలని సీఎం చంద్రబాబు ఎప్పుడూ చెప్తుంటారు. పేదలకు న్యాయం జరగాలన్న లక్ష్యంతో పని చేస్తున్నాం. వ్యాపారులు, ప్రజల శ్రేయస్సు దృష్ట్యా నిర్ణయాలు తీసుకుంటున్నామని అన్నారు. వ్యాపారస్థులు, బిల్డర్లు అందరూ స్టేక్ హోల్డర్లుగా ఉండే రెవెన్యు శాఖలో స్లాట్ బుకింగ్ సౌకర్యం ఏర్పాటు- జరిగింది. ఇక నుంచి రోజుల తరబడి వేచి చూసే అవకాశం లేకుండా రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుకింగ్ చేస్కోవచ్చు. అమ్మకదారులు, కొనుగోలుదారులు, సాక్షులు.. ఇలా అందరికీ ఇబ్బంది లేకుండా స్లాట్ బుకింగ్ విధానం అందుబాటు-లో ఉంటు-ంది. మంచి ఫలితాలు ఇవ్వాలనే ఉద్దేశంతో ముందుకు వెళ్తున్నామని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. 26 జిల్లా కేంద్రాల్లో స్లాట్ బుకింగ్ సౌకర్యం ఉంటుంది. 290 కి పైగా ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అందుబాటు-లో ఉంటుంది. రెవెన్యూ కోసం ప్రజల్ని ఇబ్బంది పెట్టే అవసరం ప్రభుత్వానికి లేదు. భూ వివాదాలు లేకుండా సంస్కరణలు తీసుకువస్తున్నాం. పారదర్శకంగా ఉండడం కోసమే మెరుగైన సౌకర్యాలు అందిస్తున్నాం. అభివృద్ధి కోసం నాలా చట్టాన్ని కూడా తీసేసి కొత్త విధానం తెస్తున్నాం. భూ పరిపాలన, ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్లో మంచి సదుపాయాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం అని మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. 'రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఎన్నో సంస్కరణలు తీసుకువస్తున్నాము. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో అవినీతి తగ్గేలా చర్యలు చేపడుతున్నాం. అందులో భాగంగా స్లాట్ విధానం అమలులోకి తేస్తున్నాము' అని రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియా చెప్పారు.

# మృత్యువుతో పోరాటంలో ఓడిన నాగాంజలి

### 12 రోజులుగా వెంటిలేటర్‌పై చికిత్స -చివరకు తుదిశ్వాస విడిచిన ఫార్మా విద్యార్థి

రాజమండ్రి ఏప్రిల్ 4, ఆంధ్ర ప్రగతి :

గత 12 రోజులుగా మృత్యువుతో పోరాడిన ఫార్మాసిస్ట్ నాగాంజలి ఓడిపోయింది. కిమ్స్ బొల్లినేని ఆసుపత్రిలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన పార్మసిస్ట్ నాగాంజలి మృతి చెందింది. 12 రోజులుగా చావుబతుకుల మధ్య పోరాడుతూ వెంటిలేటర్ పైనే ఉన్న ఫార్మాసిస్ట్.. శుక్రవారం తుదిశ్వాస విడిచింది. నాగాంజలి మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కిమ్స్ బొల్లినేని ఆసుపత్రిలో ఏజీఎంగా పనిచేస్తున్న దీపక్ లైంగిక వేధింపుల వల్ల పార్మాసిస్ట్ నాగాంజలి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. నిందితుడు దీపక్‌ను ఇప్పటికే పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడ్ని కఠినంగా శిక్షించాలంటూ అన్ని రాజకీయ పార్టీల నేతలను బాధితురాలి తల్లిదండ్రులు అనంతలక్ష్మి, దుర్గారావులు మొర్రపెట్టు-కున్నారు. కాగా.. గత నెల 23న తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం కిమ్స్ బొల్లినేని ఆసుపత్రిలో



ఇంటర్న్‌షిప్ చేస్తున్న వికాస్ ఫార్మసీ కళాశాల ఫార్మ్ డి ఫైనలియర్ విద్యార్థిని నాగాంజలి (23) ఆత్మహత్యాయత్నం తీవ్ర సంచలనం రేపింది. ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మం డలం రౌతుగూడెం గ్రామానికి చెందిన నాగాంజలి రాజమహేంద్ర వరం సమీపంలోని మధురపూడి వద్ద వికాస్ ఫార్మసీ కళాశాలలో ఫార్మ్ డి ఫైనలియర్ చదువుతోంది. అయితే గత నెలలో నాగాంజలి ఆస్పత్రిలోనే ఎనస్థీషియా అత్యధిక డోస్ ఇంజక్షన్ తీసుకుంది. దీంతో ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. వెంటనే గమనించిన సహచరులు ఐసీయూలోకి తరలించి చికిత్స అందజేశారు. ఈ క్రమంలో నాగాంజలి డైరీలో రాసుకున్న సూసైడ్ లెటర్ బయటకు రావడంతో తల్లిదండ్రులు, బంధువులు, విద్యార్థినిలు రాజమహేంద్రవరంలో ఆందోళనకు దిగారు. ఆసుపత్రిలో మెడికల్ కోఆర్డినేటర్‌గా పనిచేస్తున్న దీపక్ వేధింపుల వల్లే నాగాంజలి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు బాధితురాలు సూసైడ్ నోట్‌లో రాసింది. అంతే కాకుండా సూసైడ్ నోట్‌లో దీపక్ వల్ల తాను అనుభవించిన బాధలను వివరించింది. ఓ ఫంక్షన్‌కు రెడ్ శారీ కట్టు-కుని వెళ్లడంతో వాడి కళ్లలో పడ్డానని.. తనను మోసం చేశాడని, తనకు మరణం తప్ప వేరే దారి లేదని, తన గురించి బెంగపెట్టు-కోవద్దని, తాను మరణించాక అవయవాలు దానం చేయాలి అంటూ ఫార్మాసిస్ట్ సూసైడ్ నోట్ రాసిమరీ ఆత్మహత్య యత్నానికి పాల్పడింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అయితే 12 రోజుల పాటు- మృత్యువుతో పోరాడిన నాగాంజలి చివరకు ప్రాణాలను విడిచింది. నాగాంజలి మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

# నా పోటీ సిఎం చంద్రబాబుతోనే

(మొదటి పేజి తరువాయి)

యర్రబాలెం గ్రామానికి చెందిన 248 మందికి శాశ్వత ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. అలాగే మధ్యాహ్నం నీరుకొండ గ్రామానికి చెందిన 99మందికి, రత్నాల చెరువు కు చెందిన - 199 మందికి శాశ్వత ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. ఈరోజు మొత్తం 546 మంది లబ్ధిదారులకు శాశ్వత ఇంటి పట్టాలను ఉచితంగా అందజేశారు. సొంత ఖర్చులతో బట్టలు పెట్టి మరీ లబ్ధిదారులకు ఇంటి పట్టాలను మంత్రి లోకేష్ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ప్రతీ విషయంలో చంద్రబాబుతో పోటీపడేందుకు ప్రయత్నిస్తానన్నారు. కుప్పం కంటే ఒక్క ఓటైనా ఎక్కువ వస్తుందని చంద్రబాబుతో చేసిన ఛాలెంజ్ నిలబెట్టుకున్నానని హర్షం వ్యక్తం చేశారు. మంగళగిరి ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా పరిష్కరించే బాధ్యత తీసుకుంటామని స్పష్టం చేశారు. మంగళగిరి ప్రజలను గుండెల్లో పెట్టుకుని పనిచేస్తానన్నారు. మంగళగిరిలో రానున్న రోజుల్లో కరెంట్ తీగలు కనిపంచవని చెప్పుకొచ్చారు. భూగర్భ విద్యుత్‌తో పాటు-, భూగర్భ డ్రైనేజ్, భూగర్భ గ్యాస్ వ్యవస్థను తీసుకొస్తామన్నారు. స్వచ్ఛ భారత్‌లో మంగళగిరిని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. స్వచ్ఛ మంగళగిరి కోసం ప్రజలందరి సహకారం అవసరమన్నారు. ఎవరూ ఇళ్ల ముందు చెత్త వేయొద్దన్నారు. ఎవరైనా ఇంటి ముందు చెత్త వేస్తే వారితో కలిసి తానూ ఆ చెత్త ఎత్తుతానని చెప్పారు. బహిరంగ మార్కెట్‌లో రూ.వెయ్యి కోట్ల విలువైన ఆస్తిపై శాశ్వత హక్కు మంగళగిరి ప్రజలకు కల్పిస్తున్నామన్నారు. తనకు ఎంత ఎక్కువ మెజార్టీ ఇస్తే అంత బలమొస్తుందని ఆనాడే చెప్పానని.. తాను ఎక్కడికి వెళ్లినా మంగళగిరి తన గుండెల్లో ఉంటు-ందని వెల్లడించారు. సూపర్ 6 హామీలు ఓ పద్ధతి ప్రకారం అమలు చేస్తూనే... మంగళగిరిలో ఏ సమస్యా లేకుండా చూసుకుంటామన్నారు. కుప్పంతో పాటు- మంగళగిరిని కూడా తెలుగుదేశం కంచుకోటగా మారుస్తా అని చంద్రబాబుకు ఇచ్చిన హామీ నిలబెట్టు-కున్నందుకు సంతోషంగా ఉందన్నారు. మంగళగిరి పేదలకు ఇంటి పట్టాల పంపిణీ రెండున్నర దశాబ్దాల కల అని చెప్పుకొచ్చారు. ఓడిన చోటే గెలిచి చూపాలని మంగళగిరిపై ప్రత్యేక దృష్టి సారించి 26 సంక్షేమ కార్యక్రమాలు ప్రతిపక్షంలో ఉండగా అమలు చేశానని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

## ప్రతి నియోజకవర్గానికీ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి

(మొదటి పేజి తరువాయి)

శుక్రవారం సచివాలయంలో ఆరోగ్య శాఖపై ఆయన సమీక్ష నిర్వహించారు. మొత్తం 175 నియోజకవర్గాలకు గాను 100 పడకలకు పైగా సామర్థ్యం ఉన్న ఆస్పత్రులు ఇప్పటికే 70 వరకు ఉన్నాయన్నారు. మిగిలిన 105 నియోజకవర్గాల్లో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణం జరిగేలా త్వరితగతిన చర్యలు తీసుకోవాలని చంద్రబాబు ఆదేశించారు. పీపీపీ పద్ధతిలో ఆస్పత్రులు నిర్మించి, నిర్వహించేలా ఆలోచన చేయాలని సూచించారు. ఇందుకోసం ముందుకొచ్చే సంస్థలకు పరిశ్రమల తరహాలోనే సబ్సిడీలు ఇచ్చే విధానం రూపొందించాలన్నారు. అమరావతిలో మెగా గ్లోబల్ మెడిసిటీ ప్రాజెక్టు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రపంచ దేశాలన్నీ వైద్యం కోసం అమరావతి వచ్చేలా అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దాలన్నారు. విద్య, వైద్య రంగాలు తమ ప్రాధామ్యాలని, గేట్స్ ఫౌండేషన్ సహకారంతో రాష్ట్రంలో అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని అధికారులకు సూచించారు. పీహెచ్‌సీ, సీహెచ్‌సీ స్థాయిలో వైద్యులు అందుబాటులో లేని సమయంలో రోగులకు వర్చువల్ విధానంలో ప్రాథమిక సేవలందేలా చూడాలన్నారు. క్యాన్సర్ స్క్రీనింగ్ ప్రక్రియపైనా సీఎం సమీక్షించారు. రూ.32.5 కోట్లతో 25 డ్రగ్ డీ-ఎడిక్షన్ సెంటర్లను బలోపేతం చేయడం, కొత్తగా మరో 13 డ్రగ్ డీ-ఎడిక్షన్ సెంటర్లను ఏర్పాటు చేయాలన్నారు. ఏజెన్సీ ఏరియాలోని పీహెచ్‌సీల్లో వైద్యుల ఖాళీలను భర్తీ చేయాలని సూచించారు. విజయనగరంలో కొత్తగా 8 డయాలసిస్ సెంటర్లు ఏర్పాటు చేయాలని, ఎన్టీఆర్, విజయనగరం, బాపట్ల జిల్లాల్లో డయాలసిస్ మెషిన్లు పెంచాలని, కొవ్వూరు-నిడదవోలు సీహెచ్‌సీలు అప్‌గ్రేడ్ చేయాలని ఆదేశించారు. కుప్పంలో అమలు చేస్తున్న డిజిటల్ సర్వే సెంటర్ పురోగతిని సీఎం అడిగి తెలుసుకున్నారు. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ అభివృద్ధి చేసిన వినూత్న ఆరోగ్య సంరక్షణ కార్యక్రమం ఇది. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ను ఉపయోగించి ఆరోగ్య సంరక్షణ అందించడానికి డిజిటల్ సర్వే సెంటర్ దోహదపడతుందని చంద్రబాబు అన్నారు. దేశంలోనే అత్యధికంగా 4.47 కోట్ల మందికి రాష్ట్రంలో అభా కార్డులు జారీ అయ్యాయని, టీబీ ఎలిమినేషన్ కింద 82,693 మంది గిరిజనులకు ప్రత్యేకంగా స్క్రీనింగ్ చేయగా 5,072 మందికి పాజిటివ్ కేసులు నమోదు అయ్యాయని అధికారులు వివరించారు. 10,11,461 మంది గిరిజనులకు స్క్రీనింగ్ చేయగా 1977 మందికి సికిల్ సెల్ ఎనీమియా పాజిటివ్‌గా తేలిందన్నారు. రాష్ట్రంలో 95.60 శాతం జనన, మరణాల నమోదు జరిగిందని, 13,26,621 శిశు ఆధార్‌లు జారీ అయ్యాయని వివరించారు.

## హిందువుల రక్షణపై దృష్టి పెట్టండి

(మొదటి పేజి తరువాయి)

రెండు దేశాల మధ్య సానుకూల, నిర్మాణాత్మక సంబంధం అవసరారన్ని ప్రధాని మోడీ యూనస్‌కి తెలియజేశారు. అదే సమయంలో పర్యావరణాన్ని దెబ్బతీసే విధంగా మాట్లాడటాన్ని నివారించాలని కోరారని విదేశాంగ మంత్రి విక్రమ్ మిస్రీ విలేకరుల సమావేశంలో చెప్పారు. భారతదేశంలోని ఈశాన్య రాష్ట్రాల గురించి యూనస్ వ్యాఖ్యలు చేసిన కొన్ని రోజుల తర్వాత ప్రధాని మోడీ నుంచి యూనస్‌కి హెచ్చరిక లాంటి సూచన రావడం గమనార్హం. ఇటీవల ఈశాన్య రాష్ట్రాలలోకి మీ ప్రభావాన్ని విస్తరించాలని చైనాను యూనస్ కోరుతున్న వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. యూనస్ తీరుపై భారత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. తాజాగా, మోడీ-యూనస్ భేటీలో బంగ్లాదేశ్‌తో ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడానికి భారత్ నిబద్ధతను ప్రధాని మోడీ పునరుద్ఘాటించారు. గతేడాది షేక్ హసీనా పదవి నుంచి దిగిపోయినప్పటి నుంచి రెండు దేశాల మధ్య సంబంధాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. బంగ్లాదేశ్ వ్యాప్తంగా హిందువులు, ఇతర మైనారిటీలపై దాడులు జరిగాయి. ఈ దాడుల పట్ల భారత్ తన అభ్యంతరాన్ని బంగ్లాదేశ్‌కి తెలిపింది. దాడులను అడ్డుకోవాలని సూచించింది. ఈ భేటీలో ప్రజాస్వామ్య, స్థిరమైన, శాంతియుత, ప్రగతిశీల, సమ్మిళిత బంగ్లాదేశ్‌కు భారతదేశం మద్దతు ఇస్తుందని ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు. బంగ్లాదేశ్‌తో సానుకూల మరియు నిర్మాణాత్మక సంబంధాన్ని ఏర్పరచుకోవాలనే భారతదేశం ఆకాంక్షను ప్రొఫెసర్ యూనస్ నొక్కిచెప్పారని మిస్రి అన్నారు. సరిహద్దు భద్రతపై ఇద్దరు నేతలు చర్చించారు. అక్రమ చొరబాటు-లను నిరోధించడానికి చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని ప్రధాని మోడీ చెప్పారు. బంగ్లాదేశ్ లోని హిందువులు సహా మైనారిటీ-ల భద్రతపై ప్రధాని తన ఆందోళన వ్యక్తం చేసినట్లు- మిస్రీ వెల్లడించారు.

# 300 కోట్లు విలువచేసే మార్కెట్ యార్డ్ స్థలం పై ఓ ప్రజాప్రతినిధి కన్ను..!

- స్థలం మాదే అంటూ హైకోర్టులో రిట్ పిటిషన్.
- పశువుల సంతకే ఎందుకు పరిమితం చేశారు.
- 8.5 ఎకరాల స్థలం పై కన్నేసిన ప్రజాప్రతినిధి.
- అధికారులకు తెలిసినా ఆ నాయకుడికి మద్దతు ఇస్తున్నారా.?
- కలెక్టర్ కార్యాలయం ఏర్పాటుకు అధికారులు
- నో అని ఎందుకు చెప్పారో "అర్థం అయిందా రాజా".!









ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 04:

నంద్యాల జిల్లా కావడంతో కోట్లు విలువచేసే స్థలాలపై కబ్జా దారులు రెచ్చిపోతున్నారు.ఖాళీ స్థలం కనిపిస్తే చాలు బుల్ డోజర్లతో చదును చేసి,నకిలీ డాక్యుమెంట్స్ సృష్టించి భయాందోళనలు సృష్టించి పబ్బం గడుపుతున్నారు.బాధితులకు న్యాయం జరగడం లేదు.తాజాగా నంద్యాల నూనె పల్లె లోని 8.5 ఎకరాల మార్కెట్ యార్డ్ స్థలంపై ఒక ప్రజా ప్రతినిధి కన్ను పడినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.నకిలీ డాక్యుమెంట్స్ సృష్టించి ఈ స్థలం మాదే అంటూ హై కోర్టులో రిట్ పిటిషన్ వేశారని మార్క్ ఫెడ్ డైరెక్టర్,సీనియర్ న్యాయవాది తాతి రెడ్డి తులసిరెడ్డి ఇటీవల మీడియా ముందు ఆరోపించారు.వివరాల్లోకి వెళితే నంద్యాల పట్టణం నూనె పల్లెలో కొన్నేళ్ల క్రితం మార్కెట్ యార్డ్ ఏర్పాటుచేశారు.రైతులకు సంబంధించిన లావాదేవీలు అప్పట్లో బాగా జరిగాయి.కాలక్రమేనా టెక్క మార్కెట్ యార్డ్ ప్రారంభం కావడంతో అధికారులు,మార్కెట్ యార్డ్ చైర్మెన్,సభ్యులు అక్కడికి మారిపోయారు.నటి నుంచి నేటి వరకు ఆలనా పాలన కరువైంది .గతంలో పౌరసరఫరాల గోడౌన్ లలో బియ్యం,తదితర వస్తువులు ఉండేవి.నేతలు,అధికారుల నిర్లక్షం తో మార్కెట్ యార్డ్ నిర్జీవంగా మారిపోయింది.గోడౌన్ లకు ఉన్న కొన్ని కిటికీలు,కొన్ని సామాగ్రి చోరికి గురైనట్టు సమాచారం.నంద్యాల రోజు,రోజు కు పెరిగిపోవడం జిల్లా కావడంతో స్థలాలకు రెక్కలు వచ్చాయి.మార్కెట్ యార్డ్ స్థలం 8.5 ఎకరాలు ఉండడంతో కలెక్టర్ కార్యాలయం ఏర్పాటుకు



అనువైన స్థలంగా ఉంటుందని జిల్లా అధికారులు భావించినా సరైనా మార్గాలు లేవంటూ కొందరు అధికారులు తప్పు దోవ పట్టించారు.ప్రస్తుతం మార్కెట్ విలువ 300 కోట్లు ఉంటుందని అంచనా.ఈ నేపథ్యంలోనే తాజాగా ఒక ప్రజాప్రతినిధి కి ఈ స్థలంపై కన్నుపడినట్టు తెలుస్తోంది.ప్రజాప్రతినిధి మదిలో ఓ కార్యరూపం దాల్చడం,కొందరు అధికారులు వెనకుండి మద్దతు ఇస్తున్నట్టు సమాచారం.రాజు తలుచుకుంటే దెబ్బలు కొదవా అన్నట్టు మార్కెట్ యార్డ్ ఆలనా పాలనా మరిచిపోవడంతో మందుబాబులకు ,పశువులకు ఆవాసంగా మారింది.మార్కెట్ యార్డ్ ను శుభ్రపరచకపోవడంతో పిచ్చి మొక్కలు పెరిగి అడవిని తలపిస్తున్న అధికారులు కానీ,నాయకులు కానీ అటువైపు వెళ్ళిన దాఖలాలు కనిపించడం లేదు.ప్రతి శనివారం పశువుల సంతను మాత్రం ఏర్పాటు చేస్తున్నారు.పశువుల కట్టడిలో కొందరు అధికారులు,సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఈ నేపథ్యంలోనే ఇటీవల ఆ ప్రజా ప్రతినిధి ఈ స్థలం మాదే అంటూ తప్పుడు డాక్యుమెంట్స్ సృష్టించి రిట్ పిటిషన్ వేసినట్టు తెలుస్తోంది.అధికారులు ఇప్పటికైనా కోట్లు విలువ చేసే స్థలం పై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

---

# వెనుకబడిన వర్గాల ఆశాజ్యోతి బాబు జగ్జీవన్ రామ్



**సమరయోధుడు**
**దేశ ఉప ప్రధాని**
**డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్**
**117 వ జయంతి నేడు.!**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 04:**

వెనుకబడిన వర్గాల ఆశాజ్యోతి ,రాజకీయవేత్త స్వాతంత్ర దేశ స్వాతంత్రం కోసం సామాజిక సమానత్వం కోసం పోరాడిన ఆదర్శ నేత కుల రహిత సమాజం కోసం తన జీవితాంతం కృషిచేసిన బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి. అందుకే భారత దేశవ్యాప్తంగా డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 117 వ జయంతి సందర్భంగా ఉత్సవాలు ఘనంగా నిర్వహించడం ఆనవాయితీ ఆయన భావజాలాన్ని ముందుకు తీసుకెళ్లడం దళిత బహుజనుల కర్తవ్యంగా పని చేస్తూ ఉంటారు. బాబు జగ్జీవన్ రామ్ 1908 వ సంవత్సరంలో ఏప్రిల్ 5 వ తారీఖున బీహార్ రాష్ట్రంలోని షాహాబాదు జిల్లాలోని చాంద్వా అనే చిన్న గ్రామంలో ఆయన పుణ్య దంపతులకు జన్మించడం జరిగినది. తల్లి బసంతిదేవి తండ్రి శోభిరామ్ అయితే వీరి తండ్రి మొదట బ్రిటిష్ సైన్యంలో పని చేసేవాడు. తన తండ్రి నుండి మానవత్వవాదం, ఆదర్శ వాదం, స్థితిస్థాపకత విలువలను నేర్చుకున్నాడు. డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ భారతదేశ రిపబ్లిక్ నందు తొలి తొలిసారిగా జరిగిన లోకసభ ఎన్నికలకు ఎన్నికలలో జరిగిన లోకసభ లోకసభ కి 1952 వ సంవత్సరంలో ప్రవేశించారు. అయితే జగ్జీవన్ రామ్ ఎనిమిది సార్లు ఏకధాటిగా గెలిచారు. నాలుగు దశాబ్దాలు పాటు కేంద్ర మంత్రిగా, దేశ ఉప ప్రధానిగా దేశంలో ప్రజారాజ్య నిర్మాణానికి నిర్విరామంగా దేశం కోసం కృషిచేశారు. మొదటి శ్రేణి పార్లమెంటేరియన్ గా నిలిచాడు 1935 వ సంవత్సరంలో శాసనసభలకు జరిగే జరిగే ఎన్నికలకు గాను డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ బరిలో నిలిపిన 15 మంది సభ్యులలో 14 మంది పోటీ లేకుండా ఎన్నికయ్యారు ఇది ఆయన ఘన చరిత్ర. దశాబ్దాల పాటు కేంద్ర మంత్రిగా పనిచేయడం ఒక చారిత్రాత్మకమైన విజయంగా మేధావులు, ప్రజాస్వామ్యవాదులు, అభిప్రాయపడ్డారు. జగ్జీవన్ రామ్ ఏ శాఖ మంత్రిగా పనిచేసినా ఆ శాఖలో దళితుల కోటాను తప్పనిసరిగా భర్తీ చేసేవాడని డాక్టర్ సి సుబ్రహ్మణ్యం పార్లమెంటులో చమత్కరిస్తూ ఉండేవారు. ఆనాటి పార్లమెంటు సభ్యులు ఆయనను బాబుజీ అని పిలిచేవారు. అయితే బాబుజీ చెయ్యి గోల్డెన్ హ్యాండ్ అని అనేకమంది కొనియాడేవారు డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ అమూల్య రత్నం అని మోహన్ దాస్ కరంచంద్ గాంధీ కొనియాడేవారు. బాబు జగ్జీవన్ రామ్ చెయ్యి తాకిన ప్రతి ఒక్కరికి బంగారు భవిష్యత్తు లభించిందని ఆ రోజుల్లో అభిప్రాయం నెలకొంది. మంత్రివర్యులుగా పాతికేళ్లపాటు కొనసాగినప్పటికీ ఎక్కడ కూడా దేశంలో అవినీతి మరకలు అంటని ఒక అందమైన తెల్ల పేపర్ గా ఆయన జీవితము కొనసాగింది. ఆయన షెడ్యూల్డ్ కులాల వంటి అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన ప్రముఖ భారతీయ కార్యకర్త ,ఒకగొప్ప రాజకీయ నాయకుడు ఆయన బీహార్ రాష్ట్రంలో ఒక "అంటరాని వాడిగా" పరిగణించబడే చెమార్ కులంలో జన్మించారు. చమార్ షెడ్యూల్ కులంలో ఉత్తర భారత దేశంలో ఇలా పిలవబడతారు అంటే వృత్తిపరంగా జంతువుల చర్మాలు తీసేవారు, చెప్పులు కుట్టేవారు అని అర్థం. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్రాలలో వీరిని మాదిగలు అంటారు ఉత్తర భారతదేశంలో పై విధంగా పిలిచేవారు. ఆయన సైన్స్ లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన తర్వాత ఆయన సామాజిక కార్యకలాపాలు నిర్వహించేవారు.

ఆసందర్భంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ దృష్టిలోకి వచ్చాయి. 1935 వ సంవత్సరంలో అంటరాని వారిగా పరిగణింపబడే సమాజానికి,సమానత్వం సాధించడానికి కట్టుబడి ఉన్న ఆల్ ఇండియా డిప్రెసెడ్ క్లాస్ లీగ్ ను స్థాపించడంలో ఆయన ఒక కీలక పాత్ర పోషించారు. అటు తరువాత ఆయన 1936 సంవత్సరం నుండి పార్లమెంటేరియన్ అయ్యాడు మరియు 1986 వరకు సేవలందించాడు ఇవి 50 సంవత్సరాల నిరంతర పార్లమెంటరీ సేవ యొక్క రికార్డు అని చెప్పవచ్చు.

డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ కార్మిక శాఖ మంత్రిగా, రక్షణ శాఖ మంత్రిగా, వ్యవసాయ శాఖ మంత్రిగా, దేశానికి చేసిన సేవ ఎంతో గొప్పది.

డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జవహర్లాల్ నెహ్రూ క్యాబినెట్లో తాత్కాలిక ప్రభుత్వము యొక్క మొట్టమొదటి మంత్రివర్గంలో సభ్యుడు. అదేవిధంగా ఆయన భారత రాజ్యాంగ సభలో సభ్యుడుగా పనిచేశారు. మరియు అతిపిన్న వయస్కుడైన మంత్రి కూడా ఆయనే, 1970 వ సంవత్సరము నుండి 1974 వ సంవత్సరము వరకు రక్షణ శాఖ మంత్రిగా సేవలందించారు., మరియు 1977 నుండి 1979 వరకు ఉప ప్రధానమంత్రిగా దేశానికి అమోఘమైన సేవలు అందిస్తూ నిజాయితీగా పనిచేశారు. వాస్తవంగా 1946 వ సంవత్సరంలో డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్, జవహర్ లాల్ నెహ్రూ తాత్కాలిక ప్రభుత్వంలో అతిపిన్న వయస్సు కలిగిన వ్యక్తి మంత్రిగా బాధ్యతలు చేపట్టడం దేశ చరిత్రలో ఇది ఒక చరిత్రగా నిలిచిపోయింది. భారతదేశ మొట్టమొదటి క్యాబినెట్ కార్మిక శాఖ మంత్రి. ఆయన భారత రాజ్యాంగ పరిషత్తు సభ్యుడుగా సామాజిక న్యాయం రాజ్యాంగంలో పొందపరచబడినందుని స్వయంగా ఆయనని నిర్ధారించాడు. అదే విధంగా భారత జాతీయ కాంగ్రెస్ సభ్యుడిగా 40 సంవత్సరాలకు పైగా వివిధ శాఖల క్యాబినెట్ మంత్రిగా పనిచేశారు ఈ ఘనత ఆయనది భారతదేశ మొట్టమొదటి క్యాబినెట్ కార్మిక మంత్రి మరియు భారత రాజ్యాంగ పరిషత్ సభ్యుడుగా సామాజిక న్యాయం రాజ్యాంగంలో పొందుపరచబడిందని నిర్ధారించాడు.అదేవిధంగా భారత జాతీయ కాంగ్రెస్ సభ్యుడుగా 40 సంవత్సరాలు పైగా వివిధ శాఖల క్యాబినెట్ మంత్రిగా సేవలందించారు ఈ ఘనత ఆయనది 1971 వ సంవత్సరంలో భారత రక్షణ మంత్రిగా ఉన్న సందర్భంలో బంగ్లాదేశ్ ఏర్పాటుకు సుగమం ఏర్పడింది .అలాగే భారతదేశంలో హరిత, విప్లవం వ్యవసాయాన్ని ఆధునికరించడంలో ఎనలేని సేవ దేశానికి కృషి చేశారు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రిగా ఆయన అందించిన సహకారము ఎంతో గొప్పది. ఈ రెండు కీలకమైన పదవీకాలంలో అంటే 1974వ సంవత్సరంలో ఏర్పడిన కరువు సమయంలో ఆహార సంక్షోభాన్ని నివారించడానికి ప్రత్యక్షంగా అదనపు మంత్రిత్వ శాఖను నిర్వహించమని దేశ ప్రధాని కోరినప్పుడు అంగీకారం తెలిపారు ఆ సందర్భంలో ఆహార సంక్షోభాన్ని గట్టెక్కించాడు. భారత అత్యవసర స్థితి సమయంలో 1975 వ సంవత్సరం నుండి 1977 సంవత్సరం వరకు శ్రీమతి ప్రధాని ఇందిరాగాంధీకి మద్దతు ఇచ్చినప్పటికీ 1977 సంవత్సరంలో కాంగ్రెస్సు విడిచి పెట్టడం జరిగింది. జరిగింది ఆ సందర్భంలో జనతా పార్టీ కూటమిలో డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ చేరాడు. తదనంతరం కాంగ్రెస్ ఫర్ డెమోక్రసీ పార్టీతో పాటు భారత ఉప ప్రధాని మంత్రిగా పనిచేశాడు. 1977 -1979 తర్వాత 1981 వ సంవత్సరంలో డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ భారత జాతీయ కాంగ్రెస్ ( జె) అంటే జగ్జీవన్ రామ్ ను స్థాపించాడు. భారతీయ కుల వ్యవస్థ లోని చమార్ కులంలో జన్మించిన సంగతి దేశ ప్రజలకు తెలిసినదే. ఆయన అన్న సంత్ లాల్, మరియు ముగ్గురు సోదరీమణులు ఉన్నారు. ఆయన జీవిత కాలంలో ఆయన నిర్వహించిన పదవులు అనేకం అందులో భారత దేశ చరిత్రలో వరుసగా 30 సంవత్సరాలు పాటు కేంద్ర శాసనసభ సభ్యుడుగా మరియు భారతదేశంలో సుదీర్ఘకాలం క్యాబినెట్ మంత్రిగా రికార్డు ఆయన సొంతం దేశానికి కేంద్ర కార్మిక శాఖ మంత్రిగా 1946 నుండి 1952 వరకు కొనసాగారు కేంద్ర కమ్యూనికేషన్ మంత్రిగా 1952 నుండి 1956 వరకు పరిపాలన అందించారు కేంద్ర రవాణా రైల్వే శాఖ మంత్రిగా 1956 నుండి 1962 వరకు కేంద్ర రవాణా కమ్యూనికేషన్ మంత్రిగా 1962 నుండి 1963 వరకు అత్యుత్తమ సేవలు అందించారు అదేవిధంగా కేంద్ర కార్మిక ఉపాధి పునర్వాసం మంత్రిగా 1966 సంవత్సరం నుండి 67 సంవత్సరం వరకు కేంద్ర ఆహార వ్యవసాయ మంత్రిగా 1967 నుండి 1970 వరకు దేశాన్ని కరువు నుండి విముక్తి చేశారు , డాక్టర్ బాబు జగ్జీవన్ రావు గారు కేంద్ర రక్షణ మంత్రిగా 1970 నుండి1974, ఈ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు 1971వ సంవత్సరంలో ఇండియా-పాకిస్తాన్ యుద్ధం జరిగినప్పుడు బంగ్లాదేశ్ స్వాతంత్రం పొందినది. మరియు 1974 నుండి 1977 వరకు కేంద్ర వ్యవసాయ నీటిపారుదల శాఖ మంత్రిగా కూడా సేవలు అందించడం జరిగింది. 1977 వ సంవత్సరము నుండి 1979 వరకు మొరార్జీ దేశాయ్ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు ఉప ప్రధానిగా దేశానికి సేవలు అందించారు. చివరకు జులై 6 న 1986 వ సంవత్సరంలో తుది శ్వాస విడిచారు అందుకు ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలు ఆయన భావజాలంలో నడుచుకుంటారని ఆయన చూపిన మార్గంలో రాజకీయ సామాజిక శక్తిగా ఎదుగుతారని కోరుకుందాం.



**డాక్టర్ జి. బాలస్వామి**
న్యాయవాది మరియు ఫ్రీలాన్స్ జర్నలిస్టు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# అకాల వర్షంతో..
# అన్నదాతకు కష్టాలు.





**ఆంధ్ర ప్రగతి మహానంది ఏప్రిల్ 04:**
అన్నదాతకు తీరని నష్ట లు.. కష్టాలు వెన్నంటుతూనే ఉన్నాయి. ఆరుగాలం శ్రమించి కష్టానికి నష్టానికి చెమటోడ్చి , అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టి పండిన పంట చేతికి వచ్చే సమయానికి ప్రకృతి వైపరీత్యాల వల్ల తీవ్రంగా నష్టపోతున్నారు. కానీ పాలకులకు మాత్రం రైతుల కష్టనష్టాలు కనపడవా అని రైతులు ప్రశ్నిస్తున్నారు. ప్రజాప్రతినిధులు వేదికలపై మాత్రమే రైతులకు అండగా ఉంటామని, ప్రభుత్వపరంగా నష్టపోయిన రైతులను ఆదుకుంటామని హామీలు గుప్పిస్తూనే ఉంటారు. మహానంది, బండి ఆత్మకూరు మండలాల్లో ఖరీఫ్ సీజన్లో వరి మరియు మొక్కజొన్న రైతులకు తుఫాను మరియు పెనుగాలుల వల్ల తీవ్రంగా నష్టపోయారు. కానీ నేటికీ కూడా రైతులకు ఆర్థిక సహాయం సహాయం అందలేదు. కారణం పెనుగాలులు విచాయి గాని అత్యధిక వర్షపాతం నమోదు కాలేదని ఈ కారణం చేతనే రైతులకు అందాల్సిన సహాయం అందలేదని తెలుస్తుంది. ప్రస్తుతం రబీ సీజన్లో కూడా వరి ,అరటి, ఆరబోసిన పసుపు ఇతర పంటలు అకాల వర్షాలు, పెనుగాలుల వల్ల దెబ్బతిన్నాయి. ఒక ఏడాదిలో రెండుసార్లు రైతులు తీవ్రంగా ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టపోయిన ప్రజాప్రతినిధుల్లో కానీ, ఉన్నత స్థాయి అధికారుల్లో కానీ చలనం లేదనే ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. ఇంకా ఎంత నష్టం జరిగితే రైతుల వైపు కన్నెత్తి చూస్తారు అనేది ప్రశ్నార్థకంగా మారినట్లు తెలుస్తుంది. ఇంతకు అధికారిక లెక్క



ప్రకారం ఎన్ని కిలోమీటర్ల వేగంతో గాలులు వియ్యాలి, ఎంత వర్షపాతం నమోదు అయితే రైతుల కష్టాలు, నష్టాలు గట్టెక్కుతాయి అనేది చర్చనీయాంశంగా మారింది. కళ్ళేదుట పంటలు దెబ్బతిని రైతులు లబోదిబోమని మొత్తుకుంటుంటే, సరైన వర్షపాతం నమోదు కాలేదు అందుకే ఖరీఫ్ సీజన్లో నష్టపోయిన రైతులకు సంబంధించి సమాచారం క్రింది స్థాయి అధికారులు సేకరించి నివేదికలు పంపిన పక్కన పడేసినట్లు సమాచారం. ప్రస్తుతం రబీ సీజన్లో కూడా నష్టపోయిన రైతులకు సంబంధించి క్రింది స్థాయి సిబ్బంది అధికారులు వివరాలు సేకరించి పంపిన కూడా పాత పద్ధతిలోనే అవలంబిస్తారా లేక వాస్తవ పరిస్థితులు గమనించి రైతులకు న్యాయం చేస్తారా అనేది పాలకులు , ఉన్నత స్థాయి అధికారులు చిత్తశుద్ధి, వారి నిర్ణయ ల పై రైతుల గుండె చప్పుళ్ళు ఆధారపడి ఉంటాయి అనేది ఆధారపడి ఉంటుంది.

# సామాజిక సేవా తత్పరుడికి డాక్టర్.బి.ఆర్ అంబేద్కర్ జాతీయ ప్రతిభ అవార్డు



ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 04:
నంద్యాల పట్టణం లోని పార్క్ రోడ్ లో ఉన్న బాల అకాడమీ రవీంద్ర పాఠశాల డైరెక్టర్ ఎంజీవి రవీంద్రనాథ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ప్రతిభ అవార్డుకు ఎంపికయ్యారు. దక్షిణ ప్రైవేటు లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్ సాహిత్యం, విద్య, సామాజిక సేవా రంగాల్లో కృషి చేసిన ప్రముఖులను ఈ అవార్డుకు ఎంపిక చేశారు ఈ అవార్డును గుంటూరు శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఏప్రిల్ 13 వ తేదీన ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంటకు ప్రధానం చేస్తారు. సాహిత్యం ,విద్య ,సామాజిక సేవా రంగాలలో విశేషమైన కృషి చేయడమే కాకుండా దీనులకు, అనాధలకు ఆర్థిక సహాయం చేయడంతో పాటు వారికి అవసరమైన ఉపాధి అవసరాలను కల్పిస్తూ వారికి ఆపన్న హస్తం అందించిన సహృదయుడు, సేవా తత్పరుడు.ఇంటర్నెనల్ లయన్స్ సేవా సంస్థలో వివిధ హోదాలలో కొనసాగుతూ విద్యారంగానికి సమాజానికి ఉపయోగపడే చైతన్య కార్యక్రమాలను, అవగాహన సదస్సులను నిర్వహిస్తూ సమాజాభివృద్ధికి నిరంతరం శ్రమించే సామాజికవేత్త, సౌశీల్యుడు అయినా ఎం.జి.వి. రవీంద్రనాథ్ సార్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ప్రతిభ అవార్డు గ్రహీతగా ఎంపికైన శుభ సందర్భంగా సుందరం (ఏపీపీఎస్ఎ) ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ పాలకమండలి చైర్మన్, సుబ్రహ్మణ్య రాజు స్టేట్ ప్రెసిడెంట్ (ఏపీపీఎస్ ఏ) దండే దస్తగిరి ప్రాంతీయ అధ్యక్షులు (ఏపీపీఎస్ఎ), కో ఆప్షన్ కౌన్సిలర్ పడకండ్ల సుబ్రహ్మణ్యం గారు మరియు ఏపీపీఎస్ఎ టౌన్ అసోసియేషన్ సభ్యులు, శ్రేయోభిలాషులు, బంధువులు, రవీంద్ర పాఠశాల ఉపాధ్యాయులు ,విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందనలు తెలియజేశారు.

# శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్స కార్యక్రమం కు ఎన్ఎండి ఫిరోజ్ కు ఆహ్వానం.



ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 04: నంద్యాల పట్టణంలోని 19 వ వార్డు పోన్నాపురం కాలనీ 80 అడుగుల రోడ్డు దగ్గర ఉన్న శ్రీ కోదండ రామాలయం లో మరియు రామలింగేశ్వర స్వామి దేవస్థానం పోన్నాపురం కాలనీలో ఆదివారం 06 వ తేదీ ఉదయం 10:20 నిమిషములకు జరుగు శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవ కార్యక్రమానికి నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ ని ఆహ్వానించిన పొన్నాపురం కాలనీ ప్రజలు మరియు వడ్డెర సంఘం నాయకులు ఈ కార్యక్రమంలో పిసీ వెంకటసుబ్బయ్య , మంజుల సుబ్బరాయుడు, వడ్డే జనార్ధన్, నారాయణరెడ్డి, జనార్ధన్ గౌడ్, దాసరి సుబ్బయ్య , 19 వార్డు ఇంచార్జ్ షేక్ మున్నా, సంపంగి రామకృష్ణ , మారుతి ప్రసాద్, సంపంగి జయకృష్ణ, నాసరి సుబ్బయ్య , గుంజా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రాడ్యుయేట్ డే నిర్వహించడం చాలా గొప్ప విషయం.
## - ఏపి మార్క్ ఫెడ్ డైరెక్టర్ తాతిరెడ్డి తులసిరెడ్డి.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 04:**
నంద్యాల జిల్లా కేంద్రంలోని పద్మావతి నగర్ నారాయణ గ్రూప్ ఆఫ్ స్కూల్ ఆధ్వర్యంలో జరిగిన గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమంలో ఏపీ మార్క్ ఫెడ్ డైరెక్టర్ తాతిరెడ్డి తులసిరెడ్డి ముఖ్య అత్యధిక పా. శు క్రవారం స్కూల్ ఆవరణలో జరిగిన కార్యక్రమానికి హాజరైన తులసి రెడ్డిని పాఠశాల ప్రిన్సిపాల్ అంజనీ దేవి, కో ఆర్డినేటర్ దివ్వ తేజ, భారతీ, చంద్ర మౌళీశ్వర రెడ్డి,ప్రశాంత్, జాకీర్ పాఠశాల ఉపాధ్యాయులు ఘన స్వాగతం పలికారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలను తులసి రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏపీ టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, ఏపీ మార్క్ ఫెడ్ డైరెక్టర్, ప్రముఖ న్యాయవాది తాతిరెడ్డి తులసిరెడ్డి మాట్లాడుతూ... స్కూల్ స్థాయిలో గ్రాడ్యుయేషన్ కార్యక్రమం నిర్వహించడం గొప్ప విషయమన్నారు. 5వ తరగతి నుంచి 6వ తరగతి ప్రమోట్ అవుతున్న చిన్నారులను తులసి రెడ్డి బెస్ట్ విషెస్ చెప్పారు. చిన్నారులకు మన రామాయణ, మహాభారతాలు, సంస్కృతి సంప్రదాయాలు వివరించాలని తులసి రెడ్డి ఉపాధ్యాయులను కోరారు. నేటి బాలలే రేపటి పౌరులన్న విషయాన్ని గుర్తించి విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. విద్యార్థులు ఉపాలధ్యాయుల పట్ల గౌరవాన్ని కలిగి ఉండాలన్నారు. తాను కూడా తన



ఉపాధ్యాయులు మంచి విద్యాబుద్ధులు నేర్పించడంతో తాను ఈ రోజు ఈ స్థాయిలో ఉన్నానని తులసి రెడ్డి గుర్తు చేసుకున్నారు. ఉపాధ్యాయులు చిన్నారులకు ఉన్నత, ఉత్తమమైన లక్ష్యాలు ఉండే విధంగా వారిని తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయుల పై ఉందని తులసిరెడ్డి పేర్కొన్నారు. చిన్నారులు ఎక్కువ సమయం తల్లిదండ్రుల కంటే ఉపాధ్యాయుల వద్దే ఎక్కువ సమయం ఉంటారని.. అందువల్ల చిన్నారులు తమ టీచర్స్ చెప్పిన విషయాలనే ఎక్కువ వింటారని ఆయన చెప్పారు. విద్యార్థులకు హ్యాండ్ రైటింగ్స్ స్కిల్స్ నేర్పించాలని తులసి రెడ్డి సూచించారు. కార్యక్రమంలో భాగంగా నారాయణ గ్రూప్ ఆఫ్ స్కూల్ ఆధ్వర్యంలో తులసి రెడ్డిని ఘనంగా సన్మానించారు. గ్రాడ్యూషన్ డే కార్యక్రమంలో భాగంగా చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

# ప్రతిభ కనపరిచిన శ్రీ శాంతినికేతన్ విద్యార్థి పూర్ణచంద్ర.



ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 04: శ్రీ శాంతినికేతన్ స్కూల్ 6వ తరగతి విద్యార్థి పి. పూర్ణచంద్ర రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన "కల్పనా చావ్లా క్రియేటివ్ మైండ్స్ సైన్స్ ప్రాజెక్ట్ పోటీ" లో రెండో స్థానం సాధించి, తన ప్రతిభను చాటుకున్నాడు. ఈ పోటీలో "భారత సైన్యంలో వినియోగంలో ఉన్న వివిధ రకాల యుద్ధ విమానాలు మరియు హెలికాప్టర్లు" అనే అంశంపై ప్రాజెక్ట్ సమర్పించి, విశ్లేషణాత్మకంగా అద్భుతమైన ప్రదర్శన ఇచ్చాడు.పూర్ణచంద్ర విజయం సందర్భంగా శ్రీ శాంతినికేతన్ స్కూల్ ఛైర్మన్ శ్రీ సుధాకర్ గారు విద్యార్థిని ప్రత్యేకంగా అభినందించి, మెమెంటో మరియు మెడల్ తో సత్కరించారు. ఈ విజయం వెనుక సహాయపడ్డ ఉపాధ్యాయుల కృషిని ఆయన ప్రశంసిస్తూ, విద్యార్థుల నైపుణ్యాలను మరింత పెంపొందించేందుకు ప్రోత్సాహం అందించారు. ఇలాంటి పోటీలు విద్యార్థులకు శాస్త్ర విజ్ఞానంపై ఆసక్తిని పెంచి, భవిష్యత్ పరిశోధనలకు దారితీసే గొప్ప అవకాశాలు. ఈ విజయం పాఠశాల గర్వించదగిన ఘనతగా నిలిచింది. భవిష్యత్తులో మరిన్ని విద్యార్థులు ఇలాంటి ప్రతిభ కనబరచాలని యాజమాన్యం ఆకాంక్షించింది.

# శ్రీ సంకల్ప్ పాఠశాలలో ఘనంగా జరిగిన
# బ్రిలియంట్ మైండ్స్ సైన్స్ ఎక్స్పో







ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 04:
నంద్యాల పట్టణం లోని బాలాజీ కాంప్లెక్స్ నందు గల శ్రీ సంకల్ప్ పాఠశాలలో "బ్రిలియంట్ మైండ్స్ సైన్స్ ఎక్స్పో" ప్రదర్శన జరిగినది. ఈ కార్యక్రమానికి శ్రీ సంకల్ప్ పాఠశాలల అధినేత సుధాకర్ ప్రిన్సిపల్ పాఠశాల బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని మొదటగా చైర్మన్ సుధాకర్ చేతుల మీదుగా ప్రారంభించారు. విద్యార్థుల తల్లి తండ్రులు ప్రత్యేక అతిథులుగా పాల్గొని విజ్ఞాన మేళా ప్రదర్శనని వీక్షించారు. విద్యార్థులు ప్రదర్శించిన వైజ్ఞానిక సంబంధిత లఘు నాటికలు, నృత్యాలు , సంభాషణలు, పర్యావరణ పరిరక్షణ, సహజ వనరుల వాడకం మొదలైన వాటిని పొదుపుగా వినియోగించాలని అభినయంతో చూపరులను ఆకట్టుకుంటూ సందేశాత్మకంగా నిలిచాయి మరియు బాబా స్కిట్ ద్వారా మూడనమ్మకాలను సైన్సు పరిజ్ఞానం తో విశ్లేషణాత్మకంగా తిప్పికొట్టారు . విద్యార్థులు విజ్ఞాన మేళలో ప్రదర్శించిన హైడ్రోరాకెట్ , డ్రోన్ కేమేరాస్ , 3డి ప్రింటర్, రోషన్ శాటిలైట్ , విశ్వం – గ్రహాల ప్రాధాన్యత , మానవుని పరిణామ దశలు, ఆది మానవుడి నుండి ఆధునిక మానవుడి వరకు జరిగిన పరిణామ క్రమాలు , వివిధ రకాల రసాయన పరిశోధనలకు సంబంధించిన ప్రయోగాలు , శాస్త్రవేత్తలు వారి పరిశోధనల విశ్లేషణలు , యాసిడ్ రైన్ ప్రాజెక్ట్ , ట్రైన్ హార్న్ ప్రాజెక్ట్, వాటర్ ప్యూరిఫికేషన్, హేర్బేరియం ప్రెస్, ఇలా ఎన్నో ప్రాజెక్ట్ లను ప్రదర్శించారు. పిల్లల తల్లి తండ్రులు మాట్లాడుతూ ఈ విజ్ఞాన మేళ ద్వారా అధునాతన సైన్సు పరిజ్ఞానమునకు సంబంధించిన అద్భుత విషయాలను వారి పిల్లలతో పాటు వారు కూడా విజ్ఞాన



రహస్యాలను తెలుసుకున్నాం అని ఆనందించారు. సుధాకర్ సర్ గారు మాట్లాడుతూ వైజ్ఞానిక విజ్ఞానం చాలా ప్రధానమైనదని , ఇది నిజ జీవితంతో ముడి పడి ఉందని ఎన్నో అన్వేషణలు , విశ్లేషణల ఫలితమే సైన్సు అని, ఇది కేవలం సబ్జెక్టు మాత్రమే కాదని సందేశించారు. ఈనాటి కార్యక్రమం అద్భుతమైన ప్రదర్శనలతో కనువిందు చేస్తూ కార్యక్రమం విజయంతంగా ముగిసినది.

# రాయితీపై వ్యవసాయ యంత్రాలు పంపిణీ.



ఆంధ్ర ప్రగతి మహానంది ఏప్రిల్ 04:
మహానంది మండలం బుక్కాపురం గ్రామంలోని రైతు సేవ కేంద్రం నందు కేసీ కెనాల్ చైర్మన్ బన్నూరు రామలింగారెడ్డి రైతులకు ప్రభుత్వ రాయితీపై వ్యవసాయ యంత్రాల పనిముట్లు పంపిణీ చేశారు. శుక్రవారం వ్యవసాయ శాఖలో వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద 50 శాతం సబ్సిడీతో రూ.12 లక్షల రూపాయల వ్యవసాయ పనిముట్లను 20 మంది రైతులకు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు బుడ్డారెడ్డి యశస్విని, మండల వ్యవసాయ అధికారి బి. నాగేశ్వర్ రెడ్డి, టిడిపి నేతలు నరాల చంద్రమౌళీశ్వర్ రెడ్డి, ఉల్లి మధు, కంచర్ల శివ, జనసేన మండల అధ్యక్షుడు మా రెడ్డి రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
శుక్రవారం 4 ఏప్రిల్ 2025

# 5 మంది ముద్దాయిల అరెస్టు.



ఆంధ్ర ప్రగతి మహానంది ఏప్రిల్ 04: ఐదు మంది ముద్దాయిలను అరెస్టు చేసి నంద్యాల జే ఎఫ్ సి ఎం కోర్టులో హాజరు పరిచినట్లు మహానంది ఎస్ఐ రామ్మోహన్ రెడ్డి శుక్రవారం పేర్కొన్నారు. మార్చి 31 తేదీన గుర్తు తెలియని వ్యక్తులు గాజులపల్లె రైల్వే స్టేషన్ సమీపంలో రైల్వే ట్రాక్ కు సపోర్టుగా ఏర్పాటు చేసిన ఇనుప రాడ్లను దొంగలించారని సైట్ ఇంజనీర్ సుమంత్ కుమార్ ఫిర్యాదు చేశారని దానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టమన్నారు ఇందులో భాగస్వామ్యం అయినా ఐదు మంది ముద్దాయిల ను గుర్తించి గోపవరం గ్రామానికి చెందిన పిన్నాపురం తిరుమలేశు నాగసరపు అశోక్ , మాచర్ల ఆది కేశవ్ షేక్ సద్దాం హుస్సేన్ , ఔకు శివ అనే ముద్దాయిలను సీతారామపురం సమీపంలోని కాశిరెడ్డి నాయన ఆశ్రమం దగ్గర అరెస్టు చేసినట్లు తెలిపారు. ఒక లక్ష 10000 విలువగల ఐరన్ రాడ్లను దాదాపు ఒకటిన్నర టన్ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

## ఆత్మకూరు డివిజన్లో 30 పోలీస్ యాక్ట్ అమలు.

### -ఆత్మకూరుడీఎస్పీ ఆర్.రామాంజి నాయక్.



**ఆంధ్ర ప్రగతి ఆత్మకూరు ఏప్రిల్ 04:** ఆత్మకూర్ సబ్ డివిజన్ పరిధిలో ఉన్న పోలీస్ స్టేషన్ లు అనగా ఆత్మకూర్, కొత్తపల్లి, పాములపాడు, వెలుగోడు, నందికొట్కూర్, బ్రహ్మణకొట్కూర్, మిడ్తూర్, జూపాడు బంగ్లా, ముచ్చుమర్రి, శ్రీశైలం 1టౌన్, మరియు శ్రీశైలం 2 టౌన్ పోలీస్ స్టేషన్ ల పరిధిలో 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నందున ఎవరైనా గానీ ఏవైనా సభలు, సమావేశాలు,ర్యాలీలు, ఉత్సవాలు , ధర్నాలు ,రాస్తారోకోలు నిర్వహించుకొదలచిన వారు తప్పనిసరిగా పోలీస్ వారి అనుమతి తీసుకోవలయును. సభలు, ఊరేగింపులు మరియు బహిరంగ సభలను నియంత్రించకపోతే, శాంతిభద్రతలకు భంగం వాటిల్లడంతోపాటు ప్రజాజీవనానికి ప్రమాదం, ప్రజా ఆస్తులకు నష్టం వాటిల్లే అవకాశం ఉంది.కావున పై పేర్కొన్న షరతులకు సంబంధించిన ఏదైనా ఉల్లంఘన చట్టవిరుద్ధంగా పరిగణించబడుతుంది మరియు ప్రాసిక్యూషన్‌కు బాధ్యత వహించవలసి ఉంటుంది మరియు పోలీసు చట్టంలోని 30 సెక్షన్ ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ఆర్.రామాంజి నాయక్, సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్, ఆత్మకూర్..

## నంద్యాల సబ్ డివిజన్ పరిధిలో 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంది.

### -నంద్యాల సబ్ డివిజన్ ఏఎస్పి మంద. జావళి.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 04:**
నంద్యాల సబ్ డివిజన్ పరిధిలో ఉన్న పోలీస్ స్టేషన్ లు అనగా నంద్యాల టౌన్ లోని అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలో మరియు మహనంది, బండిఆత్మకూరు, గోస్పాడు, పాణ్యం మరియు గడివేముల పోలీస్ స్టేషన్ ల పరిధిలో 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నందున ఎవరైనా గానీ ఏవైనా సభలు, సమావేశాలు,ర్యాలీలు, ఉత్సవాలు , ధర్నాలు ,రాస్తారోకోలు నిర్వహించుకొదలచిన వారు తప్పనిసరిగా పోలీస్ వారి అనుమతి తీసుకోవలయును.సభలు, ఊరేగింపులు మరియు బహిరంగ సభలను నియంత్రించకపోతే, శాంతిభద్రతలకు భంగం వాటిల్లడంతోపాటు ప్రజాజీవనానికి ప్రమాదం, ప్రజా ఆస్తులకు నష్టం వాటిల్లే అవకాశం ఉంది.కావున పై పేర్కొన్న షరతులకు సంబంధించిన ఏదైనా ఉల్లంఘన చట్టవిరుద్ధంగా పరిగణించబడుతుంది మరియు ప్రాసిక్యూషన్‌కు బాధ్యత వహించవలసి ఉంటుంది మరియు పోలీసు చట్టంలోని 30 సెక్షన్ ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

## రాష్ట్ర మంత్రిఎన్ఎండి ఫరూక్ సాధారణ పౌరుడిగా రైలు ప్రయాణం.!



ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 04:
ప్రజాధనం వృధా చెయ్యకుండా విమానల్లో కాక నిత్యం ప్రజలకు చేరువలో ఉంటూ ప్రజారవణాను ఉపయోగిస్తూ నిత్యం ఎన్ఎండి ఫరూక్ గారి రైలు ప్రయాణం .... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 45 ఏళ్ల విస్తృత రాజకీయ ప్రస్థానం... ఎన్నోసార్లు మంత్రిగా డిప్యూటీ స్పీకర్, శాసనసభ్యుడు, శాసనమండలి సభ్యుడిగా ప్రజాసేవలో ఎనలేని సేవలాందించిన ఎన్ఎండి ఫరూక్ తనలో అవగింజ అంత గర్వం కానీ ఆహంకారం కానీ కనపడవు.. కేబినెట్ సమావేశం ముగిసిన అనంతరం విజయవాడ రైల్వే స్టేషన్‌లో, నంద్యాల వెళ్ళే ట్రైన్ కోసం ఒక సాధారణ ప్రయాణికుడిలా ప్లాట్‌ఫారంపై ఎదురు చూస్తూ కనిపించిన ఫరూక్ , తన అసలైన గౌరవాన్ని సింప్లిసిటీ ద్వారా నిరూపించారు. ప్రజల మధ్యే ఉండాలన్నదే ఆయన ధ్యేయం. విమానాల్లో ప్రయాణించే హక్కు ఉన్నా ప్రజాధనాన్ని వృధా చేయకుండా, రైలు ఎక్కడం ఆయన జీవిత తత్వం.ఈరోజు కూడా ఆయన ఒక సాధారణ పౌరుడిగా, సాధారణ ప్రయాణికుడిలా రైల్వే స్టేషన్‌లో ట్రైన్ కోసం ఎదురుచూస్తూ, ప్రజలతో కలసి, ఆప్యాయంగా పలకరిస్తూ వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని అక్కడికక్కడ పరిష్కరిస్తూ రైలు ప్రయాణం చేస్తున్నారు. ప్రస్తుతం ఎన్ఎండి ఫరూక్ గారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ మరియు మైనార్టీల సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్నప్పటికీ ప్రజాధనం ఉపయోగించి విమానాల్లో ప్రయాణించకుండా, సాధారణ ప్రజల లాంటి జీవనశైలిని అలవాటుగా మార్చుకొని, నిత్యం రైలు మార్గానే ప్రయాణన్ని ఎంచుకోవడం గమనార్హం.

## వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలను పరిశీలించిన రైతు సంఘం నాయకులు.

### -అకాల వర్షం వల్ల పంటలు -నష్టపోయిన రైతులందరికీ నష్టపరిహారం చెల్లించండి.



ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా ఏప్రిల్ 04:
గురువారం సాయంత్రం,రాత్రి కురిసిన అకాల వర్షాల వల్ల పూర్తిగా పంటలు నష్టపోయిన రైతాంగానికి ఎకరాకు 50 వేల రూపాయలు నష్టపరిహారం చెల్లించి వారిని ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి టి .రామచంద్రుడు, సిపిఎం జిల్లా నాయకులు బాల వెంకట్, రైతుసంఘం నాయకులు రామకృష్ణ, ప్రభుదాస్ లు ప్రభుత్వాన్ని ప్రకటన ద్వారా డిమాండ్ చేశారు. శుక్రవారం నాడు వారు నంద్యాల మండలంలో బిల్లాలాపురంగ్రామంలో వరి పంట నష్టపోయిన పొలాలను పరిశీలించి, నష్టపోయిన రైతులను పరామర్శించారు. సుమారు 100 ఎకరాలలో పాలు పోసుకునే దశలో పూర్తిగా కిందికి పడిపోయి, ఏమాత్రం పెట్టుబడి కూడా రైతులకు అందకుండా పోయే విధంగా పంటనష్టం జరిగిందన్నారు. అత్యధికంగా పేద రైతులు, కౌలు రైతులు తీవ్రంగా పంట నష్టపోయిన పోయారు. నష్టపోయిన రైతులు తమ గోడును రైతుసంఘం నాయకులకు విన్నవించారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులునంద్యాల మండలఅగ్రికల్చర్ ఆఫీసర్ తో ఫోన్లో మాట్లాడి వెంటనే నష్టపోయిన పొలాలను వ్యవసాయ అధికారులు పరిశీలించి నష్టపరిహారం అంచనా వేసి ప్రభుత్వానికి పంపాలని, వెంటనే నష్టపరిహారం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నంద్యాల మండలం తో పాటు బండి ఆత్మకూరు ,మహానంది మండలాల్లో వరి పంట చేతికి వచ్చిన దశలో పూర్తిగా నేలపాలై , తీవ్రమైన నష్టం వాటిలిందని, పెట్టుబడుల కోసం ఎకరాకు 40 వేల రూపాయల వరకు షుగర్ లెస్ ఓరి పంటకు పెట్టుబడిగా పెట్టారని, వీటికి తోడు ఎకరాకు 14 బస్తాలు కౌలు ఒప్పుకున్నారని, కనీస పెట్టుబడులు కూడా రాకుండా పూర్తిగా నష్టపోయిన రైతులకు ప్రభుత్వమే అండగా నిలబడి, వారికి ఎకరాకు 50 వేల రూపాయలు నష్ట పరిహారం చెల్లించి వారిని ఆదుకోవాలని కోరారు. అలాగే మహానంది మండలంలో అరటి తోటలు పూర్తిగా గాలికి పడిపోవడం వల్ల తీవ్రమైన నష్టమే జరిగిందన్నారు. కావున జిల్లాలోని వ్యవసాయ అధికారులు మరియు ఉద్యానవన శాఖ అధికారులు వెంటనే జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో వర్షాల వల్ల నష్టపోయిన ప్రాంతాలను పరిశీలించి, నష్టపోయిన రైతుల వివరాలను సేకరించి, వారికి నష్టపరిహారం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఐదు సంఘం నాయకులు తో పాటు వరి పంట దెబ్బతిన్న బిల్లాలాపురం గ్రామ రైతులు దిబ్బన్న ,పెద్ద నాగరాజు, ఎన్ రామకృష్ణుడు, చిన్న మదర్సా, జంగిటి కృష్ణయ్య, విజయరాజు, మద్దిలేటి తదితర రైతులు కౌలు రైతులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ పోలీసులకు సమ్మర్ కిట్లు అందజేసిన మారుతి కుమార్.

### -సిబ్బంది సంక్షేమానికి అధిక ప్రాధాన్యత.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 04:** నంద్యాల జిల్లా ఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా ఆధ్వర్యంలో సిబ్బంది సంక్షేమం కోసం వేసవి కాలంలో ట్రాఫిక్ సిబ్బంది ట్రాఫిక్ పాయింట్స్ లలో మండుచున్న ఎండల్లో వేసవి తాపానికి తట్టుకొని సమర్థవంతంగా విధులు నిర్వహించడానికి మరియు ఎండ వేడిమి వలన ఎలాంటి అనారోగ్య సమస్యలు,వడదెబ్బ తగలకుండా ఉండేందుకు నంద్యాల కాత్యాయని మెడికల్ స్టోర్ మరియు సెవెన్ హిల్స్ హాస్పిటల్ చైర్మన్ మారుతి కుమార్ సౌజన్యంతో సిబ్బందికి నాణ్యమైన మిల్టన్ సెల్లో వాటర్ బాటిల్,కళ్ళజోడు, క్యాప్, సన్ స్క్రీన్ క్రీమ్, ఎలక్ట్రోల్ ప్యాకెట్స్ ను వాటిని క్యారీ చేయడానికి బ్యాగ్ ను నేడు నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో ట్రాఫిక్ సిబ్బందికి అందజేయడం జరిగింది. ఈ కిట్లను అందజేసిన కాత్యాయని మెడికల్ స్టోర్ మరియు సెవెన్ హిల్స్ హాస్పిటల్ చైర్మన్ మారుతి కుమార్ కు నంద్యాల పోలీస్ శాఖ తరపున ఎస్పీ ధన్యవాదములు తెలియచేసినారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీతోపాటు సెవెన్ హిల్స్ హాస్పిటల్ చైర్మన్ మారుతి కుమార్, సెవెన్ హిల్స్ హాస్పిటల్ డైరెక్టర్ సుధా మోహన్ రెడ్డి, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ మల్లికార్జున గుప్తా, సబ్ ఇన్స్పెక్టర్ లక్ష్మన్న, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి.

### -ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రామినేని రాజునాయుడు పిలుపు.




**ఆంధ్ర ప్రగతి పాణ్యం ఏప్రిల్ 04:**
దేశంలో పెరిగిపోతున్న నిత్యావసర ధరలు తగ్గించాలని, రోజు రోజుకి పెరిగిపోతున్న నిరుద్యోగ సమస్య పరిష్కరించాలని తదితర డిమాండ్ల పైన ఈ నెల 11వ తేదీన ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ ఆధ్వర్యంలో పిలుపునిస్తున్నట్లు ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రామినేని రాజునాయుడు, ఆలిండియా యూత్ లీగ్ (ఏఐవైఎల్) రాష్ట్ర కార్యదర్శి రవీంద్రనాథ్ , ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులు వనం వెంకటాద్రి పిలుపునిచ్చారు.

శుక్రవారం పాణ్యం మండల కేంద్రం అంబేద్కర విగ్రహం ప్రాంగణంలో ఛలో ఢిల్లీకి సంబంధించిన పోస్టర్లు విడుదల చేయడం జరిగింది.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... దేశంలో రోజు రోజుకి నిత్యావసర ధరలు పెరిగిపోతున్నాయని దీనివల్ల పేద , బడుగు బలహీన వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వారు తెలిపారు. అంతేకాకుండా నిరుద్యోగ సమస్య తీర్చకుండా దేశ అభివృద్ధి సాధించాలంటే ఏ విధంగా అభివృద్ధి అవుతుందని వారు ప్రశ్నించారు. నూతన జాతీయ విద్యా విధానంని రద్దు చేయకుండా కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యను పూర్తిగా పేద ప్రజలకు అందని ద్రాక్షలా చేస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పునర్విభజన చట్టంలోని ప్రత్యేక హొదా అంశాన్ని పూర్తిగా కేంద్ర ప్రభుత్వం మరిచిపోయిందని, ప్రత్యేక హొదా వస్తే దేశంలో పెట్టుబడులు ఆర్థిక అభివృద్ధి పురోగతి సాధిస్తుందని కానీ అటువంటి ప్రయత్నాలు పక్కనపెట్టి కేవలం ఆంధ్రప్రదేశ్ పై కపట ప్రేమ చూపించడం దారుణం అన్నారు. అదేవిధంగా పునర్విభజన చట్టంలోనే కడప ఉక్కు పరిశ్రమ పై పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని, కడప ఉక్కు పరిశ్రమ ఏర్పడితే రాయలసీమ జిల్లాల్లోని అనేకమంది నిరుద్యోగులకు ప్రత్యక్షంగాను పరోక్షంగాను ఉపాధి అవకాశాలు దక్కుతాయని కానీ అటువంటి ప్రయత్నాలు చేయడం లేదన్నారు.

అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 11న ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని పిలుపునిస్తున్నట్లు ప్రజలు నిరుద్యోగులు యువకులు పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నేతలు శంకర్ , మద్దిలేటి , నారాయణ , జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ కార్డుదారులకు కేంద్రం శుభవార్త

### ఇకెవైసి గడువు ఏప్రిల్ 30 వరకు పొడిగింపు



**హైదరాబాద్, ఏప్రిల్ 4ఆంధ్ర ప్రగతి :** రేషన్ కార్డుదారులకు కేంద్రం గుడ్ న్యూస్ చెప్పింది. రేషన్ కార్డుదారుల కోసం ఇకెవైసి ఈ పక్రియ గడువును మళ్లీ పొడిగించింది. ఈ ఏడాది ఏప్రిల్ 30వ తేదీ వరకు దీనిని పొడిగించినట్లు-ప్రకటించింది. అసలు అయితే మార్చి 31వ తేదీ వరకు ఈ గడువు విధించిన సంగతి తెలిసిందే. జాతీయ ఆహార భద్రతా చట్టం (కఎ-ఘాఅ) కింద లబ్ధిదారులకు సబ్సిడీ పంపిణీలో పారదర్శకతను నిర్ధారించడం..అలాగే అర్హత లేని వ్యక్తుల దుర్వినియోగాన్ని నివారించడం కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ పొడిగింపు వల్ల ఇప్పటి వరకు ।-ఔ౯ఈ పూర్తి చేయని రేషన్ కార్డుదారులు ఏప్రిల్ 30 వరకు ఈ పక్రియను పూర్తి చేసుకోవచ్చునని సూచించింది. అధికారులు సైతం ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించింది. ఎందుకంటే మరోసారి గడువు పొడిగించే అవకాశం ఉండక పోవచ్చని వివరిస్తున్నారు. ।-ఔ౯ఈ పూర్తి చేయని వారి రేషన్ కార్డులు రద్దు కావచ్చునని స్పష్టం చేస్తుంది. దీని వల్ల ఉచిత రేషన్ సౌకర్యం కోల్పోయే ప్రమాదం ఉందని పేర్కొంది. ఈ విషయంలో అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం గత కొన్ని నెలలుగా ప్రచారం నిర్వహిస్తోంది. ।ఈ పక్రియను సులభంగా పూర్తి చేయడానికి రేషన్ షాపులు, ఆధార్ కేంద్రాలు లేదా ఆన్‌లైన్ పోర్టల్‌లను సంప్రదించవచ్చునని కేంద్రం స్పష్టమైన వివరణ ఇచ్చింది. మరోవైపు తెలంగాణ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. అందుకు గడువు సైతం విధించింది. ఈ గడువు పూర్తయిన వెంటనే.. ప్రభుత్వ సిబ్బంది విచారణ చేపట్టి.. అర్హులైన వారికి రేషన్ కార్డులు మంజూరు చేయనున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పదేళ్ల పాటు- ఒక్క రేషన్ కార్డు సైతం మంజూరు చేయలేదంటూ ఇప్పటికే అధికార కాంగ్రెస్ పార్టీ నేతలు ఆరోపణలు గుప్పిస్తున్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన అందరికీ తెల్ల రేషన్ కార్డు మంజూరు చేస్తామని ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన హామీ ఇచ్చిన విషయం విదితమే

# ఏపీ అంటే అమరావతి పోలవరమే కాదు...
# ఇది అందరిప్రదేశ్..

## పాలకుల నిర్లక్ష్యంతోనే రాయలసీమ వెనుకకు నెట్టివేయబడింది.

**-మే 31 న సిద్దేశ్వరంలో భారీ బహిరంగసభ.- బొజ్జా దశరథరామిరెడ్డి.**




ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 04:
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం వెనుకబడిన జిల్లాల అభివృద్ధిపై కార్యాచరణ చేపట్టకుండా కేవలం అమరావతి, పోలవరం పై కేంద్రీకృతం చేయడం భావ్యం కాదనీ.. ఏపీ అమరావతి – పోలవరమే కాదు...ఇది అందరిప్రదేశ్ గా గుర్తెరిగి అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం నంద్యాల పట్టణంలో స్థానిక ఐఎంఏ హాల్ నందు ప్రజాసంఘాల సమావేశం జరిగింది. మే 31 న నిర్వహించే సిద్దేశ్వరం అలుగు ప్రజా శంఖుస్థాపన 9 వ వార్షికోత్సవం సందర్భంగా "ప్రభుత్వ విధానాలు – వెనుకబడిన ప్రాంతాల భవిత" అంశాలపై సమితి ఉపాధ్యక్షుడు వై.యన్.రెడ్డి అధ్యక్ష్యతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి నెల్లూరు, ప్రకాశం, రాయలసీమ ఉమ్మడి జిల్లాలలోని ప్రజాసంఘాల నాయకులు హాజరయ్యారు.



ఈ సందర్భంగా బొజ్జా దశరథరామిరెడ్డి మాట్లాడుతూ..పాలకుల లోపభూయిష్ట విధానాలు, నిర్లక్ష్య ధోరణి వల్ల రాయలసీమ సామాజికంగా, ఆర్థికంగా మరింతగా వెనక్కి నెట్టివేయబడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.రాయలసీమ పట్ల పాలకుల వివక్ష 1956 వ సంవత్సరంలో మొదలై నేడు పరాకాష్టకు చేరిందని బొజ్జా ధ్వజం ఎత్తారు. నాడు కృష్ణా పెన్నార్ ప్రాజెక్టు నిర్మాణం జరిగి ఉంటే సుమారు 150 టి ఎం సీ ల నికర జలాలతో 15 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు అందేదనీ.. కానీ దీన్ని కాదని నాగార్జునసాగర్ నిర్మాణం చేపట్టి రాయలసీమకు తీవ్ర ద్రోహం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ద్రోహ పరంపర శ్రీశైలం ప్రాజెక్టు, పులిచింతల రిజర్వాయర్, పోలవరం ప్రాజెక్టు, పట్టిసీమ నిర్మాణం అంటూ రాయలసీమ అవసరాలకు ప్రాజెక్టుల నిర్మాణం పట్ల వివక్ష చూపారని విమర్శించారు. నేడు గోదావరి బనకచర్ల ఒక గేమ్ చేంజర్ అంటూ రాయలసీమకు తీవ్ర ద్రోహం ప్రభుత్వం తలపెట్టిందని బొజ్జా ఘాటుగా విమర్శించారు. విభజన చట్టం వెనుకబడిన జిల్లాలకు ఇచ్చిన ప్రత్యేక ప్యాకేజీ నిధులను 10 సంవత్సరాల నుండి సాధించకుండా, నేడు ఆ నిధులను గోదావరి బనకచర్ల ప్రాజెక్టుకు ఖర్చు పెట్టడానికి సిద్దమై, రాయలసీమ అభివృద్ధికి మోకాలు అడ్డుతున్నారని విమర్శించారు.రాయలసీమలో నిర్మించిన ప్రాజెక్టులకు పంట కాలువలు డిస్ట్రిబ్యూటరీస్ తయారు చేయకపోవడంతో సుమారు 10 లక్షల ఎకరాలకు నీరు సక్రమంగా అందే పరిస్థితి లేకుండా చేశారని తీవ్రంగా స్పందించారు. రైతులు ఈ ఆయకట్టుకు నీరు పొందడానికి ఎకరాకు 20,000 నుండి 30000 ఖర్చు పెడుతూ మోటార్లతో నీరు ఎత్తిపోసుకోవడంతో రాయలసీమ రైతాంగం ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా గోదావరి బనకచర్ల ప్రాజెక్టు బదులుగా రాష్ట్ర విభజన చట్టం పేర్కొన్నట్టుగా గోదావరి జలాలను నాగార్జునసాగర్ కుడికాలువకు తరలించి, శ్రీశైలంలో ప్రాజెక్టు పూర్తిగా రాయలసీమ అవసరాలకే వినియోగించాలని డిమాండ్ చేశారు. రాయలసీమ సాగునీటి అభివృద్ధికి కమాండ్ ఏరియా డెవలప్మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి 1500 కోట్ల రూపాయలు నిధులతో డిస్ట్రిబ్యూటరీస్ పంట కాలువలు ఏర్పాటు చేసి వచ్చే ఖరీఫ్ సీజన్ కు పది లక్షల ఎకరాలకు కచ్చితంగా నీరు లభించేలాగా కార్యక్రమాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న ప్రత్యేక ప్యాకేజీ నిధులను సాధించి రాయలసీమలో చెరువులను వాగులు, వంకలు, నదులతో అనుసంధానం చేసి పర్యావరణ పరిరక్షణ గావించి 20 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించే కార్యక్రమం చేపట్టి రాయలసీమ అభివృద్ధికి తోడ్పడాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న కడప ఉక్కు, కృష్ణానది యాజమాన్య బోర్డు కార్యాలయం కర్నూల్ లో ఏర్పాటు, జాతీయ స్థాయి వ్యవసాయ విశ్వవిద్యాలయం, హైకోర్టు, రాష్ట్రస్థాయి కార్యాలయాలు, కార్పొరేషన్లలో సగభాగం రాయలసీమలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాయలసీమలో ఏర్పాటైన ఎలక్ట్రిసిటీ రెగ్యులేటర్ కమిషన్ కార్యాలయము, హ్యూమన్ రైట్స్ కార్యాలయము, లోకాయుక్త కార్యాలయము, కొప్పర్తి శిక్షణ కేంద్రము, లా యూనివర్సిటీ తదితరులు అన్నిటిని కూడా అమరావతికి తరలించే కార్యక్రమాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. నీటి హక్కులు వుండి, నిర్వహణ, నిధులు లేక శిథిల విగ్రహాలుగా ఉన్న పందికోన, వేదవతి, గోరుకల్లు, అలగనూరు ప్రాజెక్టుల కొరకు నిధులు కేటాయించకుండా, గత ప్రభుత్వంలో కుందూనది వెడల్పుతో మట్టిని అమ్ముకున్నారని విమర్శించిన తెలుగుదేశం పార్టీ నేడు అధికారంలోకి రాగానే కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించడానికి 300 కోట్ల రూపాయల బడ్జెట్లో నిధుల కేటాయింపు చేయడం రాయలసీమ పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధిని తెలియజేస్తుందని విమర్శించారు. రాయలసీమలో చట్టబద్ధమైన హక్కులను ప్రాజెక్టులకు నీటి నిలువ చేసుకోవడానికి అవసరమైన గుండ్రేవుల రిజర్వాయర్, వేదవతి ఎత్తిపోతల పథకము, తుంగభద్ర ఎగువ సమాంతర కాలువ, సిద్దేశ్వరం అలుగు నిర్మాణాలను తక్షణమే చేపట్టాలని డిమాండ్ చేశారు.ఈ నేపథ్యంలో మే 31 న జరిగే సిద్దేశ్వరం అలుగు ప్రజా శంఖుస్థాపన సందర్భంగా సిద్దేశ్వరం దగ్గర 9 వ వార్షికోత్సవాన్ని భారీగా నిర్వహిస్తున్నామని ఈ సభలో రాయలసీమ పట్ల పాలకుల నిరంకుశ వైఖరిని ప్రపంచానికి చాటుదామని తెలిపారు. నేటి నుంచి ప్రతి పల్లె, ప్రతి ఇంటి గడపకు వెళ్ళి రాయలసీమ పట్ల పాలకుల వైఖరిని ఎండగడుతూ ప్రజలను చైతన్య పరుస్తామని ప్రకటించారు. ఏపీ అంటే అమరావతి – పోలవరం కాదని ఇది అందరి ప్రదేశ్ అని రాయలసీమ సమగ్రాభివృద్ధి కొరకు పౌరులు ముందుకు రావాలని కోరుతామన్నారు.

ఈ సమావేశంలో సమితి మహిళా నాయకురాలు, న్యాయవాది శ్రీదేవి, వెలుగొండ సాధన సమితి నాయకులు మాలకొండారెడ్డి, అనంతపురం న్యూడెమక్రసీ పార్టీ నాయకులు ప్రభాకరరెడ్డి, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక నాయకులు ఆకుమల్ల రహీం, అలగనూరు రిజర్వాయర్ పరిరక్షణ సమితి నాయకులు రామ్మోహన్ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, యువజన సంఘం నాయకులు సాదతుల్ల, పందికోన రిజర్వాయర్ ఆయకట్టు సాధన సమితి నాయకులు శేషాద్రి రెడ్డి, వాల్మీకి సంఘ నాయకులు పులికొండన్న, ఆళ్లగడ్డ రైతు సంఘం నాయకులు జాఫర్ రెడ్డి, ప్రజాస్వామ్య పరిరక్షణ వేదిక నాయకులు రామకృష్ణారెడ్డి, యాగంటి బసవేశ్వర రైతు సంఘం నాయకులు .కొండారెడ్డి, రైతు కూలీ సంఘం నాయకులు సుంకన్న, బాలీశ్వరరెడ్డి, పారిశ్రామిక వేత్త అయ్యపుశెట్టి సుబ్రహ్మణ్యం, విద్యావేత్త బాలచంద్రుడు, డేవిడ్ మరియు వివిధ గ్రామాల రైతు నాయకులు పాల్గొన్నారు.

# సొంత వివాదాలకంటే ప్రజా సమస్యలపై ఎక్కువ దృష్టి

**ఆస్తుల విషయాలకు ఇచ్చిన కవరేజీ..**
**ప్రజా సమస్యలపై ఎందుకివ్వడం లేదు**
**మోదీ ఏపీకి వస్తే కచ్చితంగా ప్రశ్నిస్తాం**
**: వైఎస్ షర్మిల**




**అమరావతి,**ఏప్రిల్ 4, ఆంధ్ర ప్రగతి :
ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా జగన్ కంటే ఎక్కువగా ప్రజా సమస్యలపై స్పందిస్తానని కాంగ్రెస్ నాయకురాలు వైఎస్ షర్మిల అన్నారు. విజయవాడలో షర్మిల మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతి పవర్ షేర్ల విషయంలో జగన్, షర్మిల మధ్య వివాదంపై మీడియా ప్రతినిధులు ఆమెను ప్రశ్నించారు. అయితే మీడియా ప్రతినిధుల తీరుపై షర్మిల అసహనం వ్యక్తం చేశారు. తాను ప్రజా సమస్యలపై మాట్లాడితే దాన్ని హైలెట్ చేయడం లేదని, ఇతర అంశాల గురించి మాట్లాడినప్పుడు మాత్రం కవరేజీ ఇస్తున్నట్లు చెప్పుకొచ్చారు. జగన్‌తో తనకున్న విబేధాల గురించి మాట్లాడతానని, అంతకంటే ముందు ప్రజా సమస్యలపై మాట్లాడాల్సిన అవసరం ఉందని షర్మిల అభిప్రాయపడ్డారు. వైఎస్ జగన్ డబుల్ స్టాండర్డ్ రాజకీయాలు మరోసారి బయటపడ్డాయని విమర్శించారు. వక్ఫ్ బిల్లు అంశంలో వైసీపీ ద్వంద్వ వైఖరి ఖండిస్తున్నాని అన్నారు. వక్ఫ్ సవరణ బిల్లును నిన్నటి వరకూ వ్యతిరేకిస్తున్నట్లు వైసీపీ కబుర్లు చెప్పిందని.. ఎన్డీఏకు బలం ఉన్న లోక్ సభలో వ్యతిరేకించి.. కేంద్రానికి కీలకమైన రాజ్యసభలో మాత్రం అనుకూలంగా ఓటేసిందని మండిపడ్డారు. జగన్ సూచనలతోనే రాజ్యసభలో ఆ పార్టీ ఎంపీలు వక్ఫ్ బిల్లుకు మద్దతు తెలిపారన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ఓటింగ్ తర్వాత విప్ జారీతో వైసీపీ డ్రామా ఆడిందని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రధాని మోదీ మళ్లీ వచ్చి మట్టి, నీరు ఇచ్చి వెళ్లిపోతారా?. ప్రధాని మోదీ మమ్మల్ని కలిసే అవకాశం ఇస్తే కచ్చితంగా మేం ప్రశ్నిస్తామన్నారు. కానీ, మోదీ వచ్చినప్పుడు మా పార్టీ వాళ్లను హౌస్ అరెస్టులు చేస్తారు కదా?. నేను మాట్లాడే ప్రజా సమస్యల కన్నా.. నేను మాట్లాడే ఇతర అంశాలనే మీడియా హైలెట్ చేస్తోందన్నారు. నిన్న కూడా వక్ఫ్ యాక్ట్ అంశం వదిలిపెట్టి వివేకా హత్య అంశాన్నే మీడియా హైలెట్ చేసిందని తెలిపారు. జగన్ వాదనలపై మాట్లాడితే పోలవరం అంశం పక్కకు వెళ్లి మిగిలిన అంశాలు హైలెట్ అవుతున్నాయి. ప్రజా సమస్యలపై మాట్లాడినప్పుడు నాకు కవరేజి ఇవ్వాలని కోరారు. జగన్ రెడ్డి స్వయంగా ఏంఓయూపై సంతకం పెట్టారు. నా పిల్లలకు ఆస్తి ఇస్తున్నట్లు ఆయనే ప్రకటించారు. గిఫ్ట్ డీడ్‌ను మా అమ్మ విజయలక్ష్మికి జగన్ చేశారు. గిఫ్ట్ ఇచ్చి మళ్లీ ఇచ్చిన షేర్లు వెనక్కి ఇవ్వాలని ఆమెపై కేసు వేశారు. తల్లిపై కేసులు వేసిన కొడుకుగా జగన్ రెడ్డి మిగిలిపోతారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

# పిఠాపురంలో అభివృద్ధి పండుగ

**నాగబాబు చేతుల మీదుగా పలు ప్రారంభోత్సవాలు**
**నూతన తహసీల్దార్ కార్యాలయాన్ని ప్రారంభించిన నాగబాబు**
**గొల్లప్రోలు తాగునీటి సరఫరా కేంద్రానికి ప్రారంభోత్సవం**
**గొల్లప్రోలులో అన్న క్యాంటీన్ ప్రారంభం**



పిఠాపురం ఏప్రిల్ 4, ఆంధ్ర ప్రగతి :
పిఠాపురం నియోజకవర్గంలో కోలాహలంగా అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు జరుగుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే తాను ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనపై ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టి సారించారు. ఆయన చొరవతో చేపట్టిన పలు అభివృద్ధి పనులు ఇప్పటికే పూర్తయ్యాయి.ఇక నేడు పిఠాపురం నియోజకవర్గ పర్యటనలో ఉన్న ఎమ్మెల్సీ నాగబాబు పూర్తయిన పనులను ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ముందుగా రూ. 28.5 లక్షల సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన గొల్లప్రోలు మండల నూతన తహసీల్దార్ కార్యాలయాన్ని శాసన మండలిలో ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్ తో కలసి ప్రారంభించారు. అనంతరం గొల్లప్రోలు హెడ్ వాటర్ వర్క్స్ లో రూ. 65.24 లక్షలతో మంచినీటి సరఫరా కేంద్రంలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. పంప్ హౌస్ లో మోటార్ల పని తీరుని పరిశీలించారు. అనంతరం గొల్లప్రోలు పట్టణంలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటిన్ ని ప్రారంభించారు. క్యాంటిన్ లో ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజనాన్ని వడ్డించారు.ఈ కార్యక్రమంలో ఏపీ టిడ్కో ఛైర్మన్ అజయ్ కుమార్, కాకినాడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మన్ తుమ్మల రామస్వామి , కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి , మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు , జనసేన పార్టీ పిఠాపురం నియోజక వర్గం సమన్వయకర్త మర్రెడ్డి శ్రీనివాసరావు , అధికారులు పాల్గొన్నారు.

# దేవుడు భూములు దోచుకుంటే శిక్ష తప్పదు

**వక్ఫ్ బిల్లు ఆమోదంతో ఆస్తుల పరిరక్షణ, జవాబుదారీతనం : పవన్ కళ్యాణ్**



అమరావతి, ఏప్రిల్ 4, ఆంధ్ర ప్రగతి :
తాను 2008–2009 చట్టం చెప్పినట్లుగా, దేవుని ఆస్తి దోచుకోవడం కేవలం దేశ ద్రోహం కంటే ఎక్కువని.. ఇది దేవుడికి ద్రోహమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. వక్ఫ్ సవరణ బిల్లు పార్లమెంటు ఉభయ సభల ద్వారా ఆమోదం పొందడం కేవలం పార్లమెంటరీ విజయం కంటే ఎక్కువ ప్రతిబింబిస్తోందని ఇది న్యాయం, పారదర్శకత, జవాబుదారీతనం వైపు ఒక చారిత్రాత్మక అడుగు అని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ట్విట్టర్ వేదికగా పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వక్ఫ్ సవరణ బిల్లును చట్టవిరుద్ధమైనదిగా పేర్కొన్న ప్రతిపక్షాలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ బిల్లులో ముస్లిమేతరుల ప్రమేయం ఎంత మాత్రం లేదని స్పష్టం చేశారు. ముస్లింల హక్కులను హరిస్తామన్న ప్రతిపక్షాల ఆరోపణలనూ ఖండించారు. ముస్లింల్లోని అన్ని తెగల వారి హక్కులను పరిరక్షించేందుకే ఈ బిల్లును తీసుకొచ్చినట్లు చెప్పారు. ఈ బిల్లుతో వక్ఫ్ ఆస్తుల నిర్వహణలో పారదర్శకతతో పాటు జవాబుదారీతనం పెరుగుతుందన్నారు. "బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టేముందు మేం రాష్ట్ర ప్రభుత్వాలు, మైనారిటీ కమిషన్లు, వక్ఫ్ బోర్డులతో సంప్రదింపులు జరిపాం. బిల్లు పరిశీలనకు జేపీసీని ఏర్పాటు చేశాం. సుదీర్ఘ చర్చ అనంతరం లోక్‌సభ ఈ బిల్లును ఆమోదించింది" అని రిజిజు చెప్పారు. ప్రస్తుతం దేశంలో 8.72 లక్షల వక్ఫ్ ఆస్తు లు ఉన్నాయన్నారు. 2006లో 4.9 లక్షల వక్ఫ్ ఆస్తుల ద్వారా రూ.12 వేల కోట్ల ఆదాయం వస్తుందని సచార్ కమిటీ అంచనా వేసిందని, అంటే ప్రస్తుతం ఆయా ఆస్తుల ద్వారా ఎంత ఆదాయం వస్తుందో ఊహించుకోవచ్చని తెలిపారు. వక్ఫ్ బోర్డు ఆస్తుల నిర్వహణలో లోపాలను, దుర్వినియోగాన్ని అడ్డుకునేందుకే ఈ సవరణ బిల్లును తెచ్చినట్లు చెప్పారు. కొన్ని రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకు రాజకీయాల కోసం అసత్యాలు ప్రచారం చేస్తున్నాయని, వక్ఫ్ ఆస్తులన్నీ ముస్లింలకు మాత్రమే చెందుతాయని స్పష్టంచేశారు. ఈ బిల్లుపై దేశవ్యాప్తంగా 284 సంస్థలు తమ అభిప్రాయాలను తెలిపాయని, కోటి మందికి పైగా ప్రజలు వినతిపత్రాలు అందించారని వెల్లడించారు. అందరితో సంప్రదింపులు జరిపిన తర్వాతే మైనారిటీ వ్యవహారాల శాఖ ఈ సవరణ బిల్లును రూపొందించిందని రిజిజు స్పష్టం చేశారు. సభ్యులందరూ బిల్లుకు మద్దతు తెలుపుతారని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ సభ్యుడు సయ్యద్ నజీర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం విద్వేషాలు రెచ్చగొట్టి, మతపరమైన ఏకీకరణ కోసం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. అబద్ధాల ఆధారం గా సవరణ బిల్లును రూపొందించారని, ఆరు నెలలుగా బీజేపీ వక్ఫ్ బిల్లుపై దుష్ప్రచారం చేసిందని ధ్వజమెత్తారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వంలో.. ఎన్డీయే పరిపాలన దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించడానికి తన నిబద్ధతను మరోసారి నిరూపించుకుందన్నారు. సంవత్సరాలుగా, వక్ఫ్ బోర్డుల కార్యకలాపాల గురించి తీవ్రమైన ఆందోళనలు ఉన్నాయన్నారు. వక్ఫ్ బోర్డు సవాళ్లను పరిష్కరించడం, పారదర్శకతను పెంచడం, వక్ఫ్ ప్రయోజనాలు పేద ముస్లింలకు చేరేలా చూడటం, ముస్లిం మహిళలకు బోర్డులో ప్రాతినిధ్యం కల్పించడం వైపు ఈ సవరణ ఒక ముఖ్యమైన అడుగు అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ఈ బిల్లుపై ఏకపక్ష నిర్ణయం కాకుండా, ఈ బిల్లును లోక్‌సభలో దాదాపు 12 గంటలు, అలాగే రాజ్యసభలో దాదాపు 14 గంటలు పూర్తిగా చర్చలు జరిగాయని, ప్రతిపక్షాలు లేవనెత్తిన ప్రతి ఆందోళనను పరిష్కరించారని, ప్రతి ప్రశ్నకు సమాధానం ఇచ్చారని పవన్ కల్యాణ్ అన్నారు. బాధ్యతాయుతమైన, రాజ్యాంగబద్ధమైన ప్రభుత్వం ఇలా పనిచేస్తుందని వ్యాఖ్యానించారు. ఈ ముఖ్యమైన బిల్లును ప్రవేశపెట్టడంలో.. మార్గనిర్దేశం చేయడంలో నాయకత్వం వహించినందుకు పార్లమెంటరీ వ్యవహారాలు, మైనారిటీ వ్యవహారాల సంక్షేమ మంత్రి కిరణ్ రిజిజు, హెూం మంత్రి అమిత్ షా.. రాజ్యసభలో ఎన్డీయే నాయకుడు జేపీ నడ్డాలకు తాను హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు. కొత్త చట్టం కేవలం చట్టం కంటే ఎక్కువని.. ఇది ఒక నైతిక వైఖరి అని అన్నారు. ఇది పవిత్ర ఆస్తులను రక్షించడం, వక్ఫ్ బోర్డును బలోపేతం చేయడం, న్యాయమని, న్యాయానికి ఎన్డీయే ప్రభుత్వం నిబద్ధతను ప్రదర్శించడం గొప్ప విషయమని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

# వక్ఫ్ బిల్లుపై వైసీపీ వంచన




అమరావతి,ఏప్రిల్ 4, ఆంధ్ర ప్రగతి : వక్ఫ్ బిల్లుపై వైసీపీ మోసపూరితంగా వ్యవహరించిందని టీడీపీ మండిపడింది. లోక్‌సభలో వ్యతిరేకించి.. రాజ్యసభలో మద్దతు పలకడం జగన్ నీచ రాజకీయాలకు అద్దం పడుతోందని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా, మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు దుయ్యబట్టారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం వారు వేర్వేరుగా విలేకరులతో మాట్లాడారు. ముస్లిలకు కూటమి ప్రభు త్వం అండగా ఉంటుందని నాగుల్ మీరా అన్నారు. చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్న ఆకాంక్షతో అన్ని వర్గాలతోపాటు ముస్లింలు కూడా టీడీపీ కూటమికి అండగా నిలిచారన్నారు. వక్ఫ్ బిల్లులో ముస్లింలకు ఇబ్బందికరంగా ఉన్న మూడు అంశాలపై చంద్రబాబు దృష్టి సారించి, వాటికి సవరణలు ప్రతిపాదించారని అన్నారు. మాట తప్పడం మడమ తిప్పడం జగన్ పేటెంట్ అని, రాజ్యసభ సాక్షిగా ముస్లింలకు ద్రోహం చేశాడని ఆనంద్‌బాబు విమర్శించారు. తల్లిని, చెల్లిని మోసం చేసిన ఆయనకు.. ఓట్ల కోసం ముస్లింను మోసం చేయడం పెద్ద లెక్కేమీ కాదన్నారు. మోదీ అరెస్టు చేయిస్తారనే భయం ఓ వైపు.. ముస్లిం ఓట్లు పోతాయనే భయం మరోవైపు.. జగన్‌ను ప్రభావితం చేయడంతో లోక్‌సభలో బిల్లును వ్యతిరేకించి రాజ్యసభలో బిల్లుకు మద్దతు పలికారని అన్నారు.వక్ఫ్ బిల్లుపై వైసీపీ డ్రామాలాడుతోందని రాష్ట్ర మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు ఫరూఖ్ షిబ్లీ ధ్వజమెత్తారు. ఎన్డీయేకు బలం ఉన్న లోక్‌సభలో వ్యతిరేకించి, బలం లేని రాజ్యసభలో అనుకూలంగా ఓటేసిందని.. జగన్ ద్వంద్వ నీతి రాజకీయం మరోసారి బయటపడిందని దుయ్యబట్టారు. బిల్లుకు రాజ్యసభలో మద్దతుగా ఓటేసిన వైసీపీ ఎంపీలు.. బయటికొచ్చాక వ్యతిరేకించినట్లు చెబుతున్నారని శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఈ బిల్లు మైనారిటీలకు వ్యతిరేకమన్న వైసీపీ.. రాజ్యసభలో సైలెంట్‌గా మద్దతు పలికిందని ఆక్షేపించారు.

# విజయాన్ని లాగేశారు



## సత్తా చాటిన లఖ్‌నవూ బౌలర్లు
## ముంబై పరాజయం
## మార్ష్ మెరుపు ఇన్నింగ్స్
## సూర్య పోరాటం వృథా

లఖ్‌నవూ: సొంత గడ్డపై లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ సత్తా చాటుకుంది. బ్యాటింగ్‌లో ఓపెనర్ మిచెల్ మార్ష్ (31 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్సర్లతో 60) మెరుపు ఆటతీరు కనబర్చగా.. అటు గెలుపు ఖాయమే అనుకున్న వేళ ముంబై ఇండియన్స్‌ను ఆఖర్లో లఖ్‌నవూ బౌలర్లు దెబ్బతీశారు. దీంతో శుక్రవారం ఉత్కంఠ సాగిన ఈ మ్యాచ్‌లో పంత్ సేన 12 పరుగుల తేడాతో నెగ్గింది. అలాగే ఐపీఎల్‌లో ముంబైతో ఆడిన ఏడు మ్యాచ్‌ల్లో లఖ్‌నవూకిది ఆరో విజయం కావడం విశేషం. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన లఖ్‌నవూ 20 ఓవర్లలో 8 వికెట్లకు 203 పరుగులు చేసింది. మార్క్రమ్ (38 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్సర్లతో 53) అర్ధసెంచరీ సాధించగా, ఆయుష్ బదోని (19 బంతుల్లో 4 ఫోర్లతో 30), మిల్లర్ (14 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్‌తో 27) సహకరించారు. హార్దిక్‌కు ఐదు వికెట్లు లభించాయి. ఛేదనలో ముంబై 20 ఓవర్లలో 5 వికెట్లకు 191 పరుగులు చేసి ఓడింది. సూర్యకుమార్ (43 బంతుల్లో 9 ఫోర్లు, 1 సిక్స్‌తో 67), నమన్ ధిర్ (24 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సర్లతో 46) పోరాడారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా దిగ్వేష్ రాఠి నిలిచాడు.

### నమన్-సూర్య పోరాడినా..

భారీ ఛేదనలో ముంబై తొలి మూడు ఓవర్లలోనే ఓపెనర్లు జాక్స్ (5), రికెల్టన్ (10) వికెట్లను కోల్పోయింది. అప్పటికి స్కోరు 17 పరుగులే. ఈ దశలో వన్‌డౌన్ బ్యాటర్ నమన్ ధిర్- సూర్యకుమార్ జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. ముఖ్యంగా నమన్ తుఫాన్ ఇన్నింగ్స్‌తో ఎల్ఎస్‌జీ బౌలర్లపై ఎదురుదాడి ఆరంభించాడు. ఎలాంటి ఒత్తిడి లేకుండా బౌండరీలు బాదేస్తూ స్కోరును చకచకా పెంచాడు. నాలుగో ఓవర్‌లో 6,6,4,4తో 21 రన్స్ రాబట్టాడు. అతడి ధాటికి పవర్‌ప్లేలో స్కోరు 64/2తో ఛేదన దిశగా సాగింది. అటు సూర్య సహకారం అందించడంతో దాదాపు 11 రన్‌రేట్‌తో ఇన్నింగ్స్ సాగింది. అయితే స్పిన్నర్ దిగ్వేష్ తొమ్మిదో ఓవర్‌లో మూడు పరుగులే ఇచ్చి నమన్‌ను బౌల్డ్ చేయగా మూడో వికెట్‌కు 69 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అనంతరం సూర్య బాధ్యతను తీసుకుని అడపాదడపా బౌండరీలు సాధించాడు. మరో ఎండ్‌లో లఖ్‌నవూ బౌలర్లు కట్టుదిట్టంగా బంతులు వేయడంతో తిలక్ వర్మ (25) భారీ షాట్లు ఆడలేకపోయాడు. అటు రన్‌రేట్ కూడా పెరగసాగింది. ఈ స్థితిలో 31 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసిన సూర్యను పేసర్ అవేశ్ అవుట్ చేయడంతో నాలుగో వికెట్‌కు 66 పరుగుల కీలక భాగస్వామ్యం ముగిసింది. అటు ముంబై అవకాశాలు కూడా సన్నగిల్లాయి. 12 బంతుల్లో 29 రన్స్ కావాల్సిన స్థితిలో 19వ ఓవర్‌లో శార్దూల్ ఏడు పరుగులే ఇచ్చి మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. అలాగే ఐదో బంతికి తిలక్ రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరగడంతో శాంట్నర్ (2 నాటౌట్) క్రీజులోకి వచ్చాడు. ఇక సమీకరణం చివరి ఆరు బంతుల్లో 22 పరుగులకు మారింది. అవేశ్ తొలి బంతిని హార్దిక్ (28 నాటౌట్) సిక్సర్‌గా మలిచినా 9 పరుగులే రావడంతో ముంబై చేసేదేమీ లేకపోయింది.





### మార్ష్ తుఫాన్ ఇన్నింగ్స్:

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన లఖ్‌నవూకు ఓపెనర్ మార్ష్ రూపంలో మెరుపు ఆరంభం లభించింది. బాదడమే లక్ష్యంగా సాగిన అతడి ఎదురుదాడికి పవర్‌ప్లేలోనే 69 పరుగులు సమకూరాయి. ఇందులో మార్ష్ ఒక్కడివే 60 పరుగులు కావడం విశేషం. మరో ఓపెనర్ మార్క్రమ్ ఈ దశలో ఆరు బంతులే ఆడాడు. వాస్తవానికి మార్ష్ తొలి ఓవర్‌లోనే అవుట్ కావాలి. అతడి బ్యాట్ ఎడ్జ్ తీసుకున్న బంతిని కీపర్ రికెల్టన్ అందుకున్నా ఎవరూ అప్పీల్ చేయలేదు. అశ్వని కుమార్ వేసిన ఆరో ఓవర్‌లో మార్ష్ 6,4,4,4తో 23 పరుగులు రాబట్టాడు. 27 బంతుల్లోనే ఈ సీజన్‌లో మూడో హాఫ్ సెంచరీని కూడా పూర్తి చేశాడు. అయితే తర్వాతి ఓవర్‌లోనే స్పిన్నర్ విఘ్నేష్ అతడిని పెవిలియన్‌కు చేర్చడంతో తొలి వికెట్‌కు 76 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అలాగే హార్దిక్ వరుస ఓవర్లలో ప్రమాదకర పూరన్ (12), కెప్టెన్ పంత్ (2)ను అవుట్ చేయడంతో ముంబైలో జోష్ కనిపించింది. కానీ ఈ దశలో మార్క్రమ్ బ్యాట్ ఝుళిపించగా, అతడికి బదోని సహకారం అందించాడు. హార్దిక్, విఘ్నేష్ ఓవర్లలో మార్క్రమ్ భారీ సిక్సర్లతో అలరించాడు. అటు బదోని 14వ ఓవర్‌లో హ్యాట్రిక్ ఫోర్లతో 15 రన్స్ సమకూర్చాడు. నాలుగో వికెట్‌కు 51 పరుగులు జత చేరాక బదోనిని అశ్వని అవుట్ చేశాడు. ఇక 34 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేసిన మార్క్రమ్‌ను హార్దిక్ దెబ్బతీశాడు. అబ్దుల్ సమద్ (4) విఫలం కాగా..చివరి ఓవర్‌లో మిల్లర్ (14 బంతుల్లో 3 ఫోర్లు, సిక్సర్‌తో 27) 6,4 బాది స్కోరును 200 దాటించాడు. అయితే మిల్లర్‌తో పాటు ఆకాశ్‌దీప్(0)ను అవుట్ చేసి హార్దిక్ 5 వికెట్లను పూర్తి చేశాడు.



2025 ఐపీఎల్‌లో ముంబయి ఇండియన్స్- లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ జట్లు శుక్రవారం తలపడనున్నాయి. ఈ మ్యాచ్‌కు లఖ్‌నవూ ఎకాన స్టేడియం వేదిక కానుంది. మ్యాచ్ కోసం ఇరు జట్ల ప్లేయర్లు ప్రాక్టీస్ చేస్తున్నారు. ఈ క్రమంలో లఖ్‌నవూ జట్టు బౌలింగ్ కోచ్ జహీర్ ఖాన్‌తో ముంబయి స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ మాట్లాడుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇందులో రోహిత్ సీరియస్‌గానే మాట్లాడుతున్నట్లు కనిపిస్తోంది.

## చేయాల్సిన టైమ్‌లో నేను అన్నీ చేశాను
### ముంబయి స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ

'చేయాల్సిన టైమ్‌లో నేను అన్నీ చేశాను. ఇప్పుడు నేను ఏమీ చేయాల్సిన అవసరం లేదు' అని రోహిత్ జహీర్‌తో అన్నాడు. అయితే ఈ మాటలు ముంబయి మేనేజ్‌మెంట్‌ను ఉద్దేశించే అన్నాడని నెటిజన్లు భావిస్తున్నారు. కెప్టెన్‌గా ఉన్నప్పుడు జట్టుకు చేయాల్సిందంతా చేసేశాడు. ఇప్పుడు తాను ఏం చేయాల్సిన అవసరం లేదని జహీర్‌తో చెప్పాడని అభిప్రాయపడుతున్నారు. కెప్టెన్సీ బాధ్యతలు లేవు కాబట్టి బ్యాటింగ్ మాత్రమే తన పని అంటున్నాడని నెటిజన్లు కామెంట్ చేస్తున్నారు. అయితే 2024 సీజన్‌కుగానూ రోహిత్ శర్మ స్థానంలో హార్దిక్ పాండ్యను ముంబయి మేనేజ్‌మెంట్ కెప్టెన్‌గా నియమించింది. అప్పట్లో దీనిపై రోహిత్ అభిమానుల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. దీంతో రోహిత్ ముంబయి జట్టును వీడతాడని ప్రచారం జరిగింది. కానీ, 2025 ఐపీఎల్‌కు రోహిత్‌ను ముంబయి 16.30 కోట్లకు రిటైన్ చేసుకుంది.

## ఐపీఎల్ నుంచి వైదొలిగిన కగిసో రబాడా



గుజరాత్ టైటాన్స్ జట్టుకు చెందిన బౌలర్ కగిసో రబాడా ఐపీఎల్ నుంచి వైదొలిగాడు. వ్యక్తిగత కారణాల వల్ల ఈ సౌతాఫ్రికా పేసర్ స్వదేశం వెళ్లిపోయాడు. ఈ మేరకు గుజరాత్ టైటాన్స్ ఓ ప్రకటన విడుదుల చేసింది. అయితే రబాడ స్వదేశం నుంచి ఎప్పుడు తిరిగి వస్తాడో, జట్టుతో ఎప్పుడు చేరుతాడో మాత్రం వెల్లడించలేదు. ఐపీఎల్ 2025లో గుజరాత్ టైటాన్స్ ఆడిన రెండు మ్యాచ్‌ల్లో ఆడాడు రబాడా. ఈ రెండు మ్యాచ్‌లో రెండు వికెట్లు పడగొట్టాడు. పంజాబ్ కింగ్స్‌పై 1/41, ముంబయి ఇండియన్స్‌పై 1/42 బౌలింగ్ గణాంకాల్ని నమోదు చేశాడు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో మ్యాచ్‌లో రబాడకు అవకాశం రాలేదు. అతని స్థానంలో జట్టులోకొచ్చిన అర్షద్ ఖాన్ కీలకమైన విరాట్ కోహ్లీ వికెట్ తీశాడు. రబాడ గైర్హాజరీలో జెరాల్డ్ కొయెట్జీ (దక్షిణాఫ్రికా) లేదా ఆల్ రౌండర్ కరీమ్ జన్నత్ (అఫ్గానిస్తాన్)ను జట్టులోకి తీసుకునే అవకాశం ఉంది. అలాగే కివీస్ ఆల్ రౌండర్ గ్లెన్ ఫిలిప్ ఇంకా ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. అతడిని జట్టులోకి తీసుకునే అవకాశాలు లేకపోలేదు. దక్షిణాఫ్రికా పేసర్ కగిసో రబాడాను గుజరాత్ టైటాన్స్ ఈ ఐపీఎల్ మెగా వేలంలో రూ.10.75 కోట్లకు కొనుగోలు చేసింది. ఐపీఎల్ కెరీర్‌లో రబాడాకు మంచి రికార్డు ఉంది. ఆడిన 82 మ్యాచ్‌ల్లో 22.29 యావరేజ్‌తో 119 వికెట్లు పడగొట్టాడు.ప్రస్తుతం పాయింట్ల పట్టికలో గుజరాత్ టైటాన్స్ నాలుగో స్థానంలో ఉంది. మూడు మ్యాచ్‌ల్లో రెండింట్లో గెలిచింది. మొదటిస్థానంలో పంజాబ్, రెండో ప్లేస్‌లో దిల్లీ, ఆ తర్వాతి స్థానాల్లో ఆర్సీబీ, గుజరాత్, కేకేఆర్, ముంబయి ఇండియన్స్, లఖ్‌నవూ, చెన్నై, రాజస్థాన్, సన్ రైజర్స్ ఉన్నాయి. కాగా, గుజరాత్ టైటాన్స్ తన తదుపరి మ్యాచ్‌లో ఏప్రిల్ 6న సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో తలపడనుంది. ఏప్రిల్ 9న రాజస్థాన్ రాయల్స్‌ను ఢీకొట్టనుంది.



## మే 24న నీరజ్ చోప్రా టోర్నీ

న్యూఢిల్లీ: స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా వచ్చే నెలలో స్వదేశీ అభిమానులను అలరించనున్నాడు. మే 24న హరియాణాలోని పంచకులలో అతడి పేరిటే జరిగే నీరజ్ చోప్రా క్లాసిక్ జావెలిన్ త్రో ఈవెంట్‌లో పోటీపడనున్నాడు. అటు ప్రపంచ అథ్లెటిక్స్ సంఘం కూడా ఈ ఎన్‌సీ క్లాసిక్‌ను గోల్డ్ కేటగిరీగా పేర్కొంది. దీంతో నీరజ్ ఈవెంట్‌ను సెప్టెంబరులో జరిగే వరల్డ్ చాంపియన్‌షిప్‌నకు అర్హత టోర్నీగా భావిస్తున్నారు. ఈ టోర్నీలో నీరజ్‌తో పాటు ఇతర ప్రపంచ జావెలిన్ త్రోయర్లు కూడా పాల్గొననున్నట్టు తెలుస్తోంది.

## ఫైనల్‌కు హితేష్
### ప్రపంచ బాక్సింగ్ కప్

జాతీయ చాంపియన్ హితేష్ బ్రెజిల్‌లో జరుగుతున్న ప్రపంచ బాక్సింగ్ కప్‌లో టైటిల్‌కు అడుగు దూరంలో నిలిచాడు. 70 కిలోల విభాగం బౌట్‌లో హితేష్ ఫైనల్‌కు దూసుకెళ్లాడు. సెమీఫైనల్లో హితేష్ 5-0తో ఫ్రాన్స్ బాక్సర్ మకాన్ ట్రవోర్‌ను చిత్తు చేశాడు. ఫైనల్ బౌట్‌లో ఇంగ్లండ్‌కు చెందిన ఒదెల్ కమరతో హితేష్ తలపడనున్నాడు. మిగతా బాక్సర్లలో జదుమని సింగ్ (50 కిలోలు), విశాల్ (90 కిలోలు), సచిన్ (60 కిలోలు) సెమీఫైనల్స్‌లో తమ ఓటమి పాలయ్యారు.



ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# బాలీవుడ్ సీనియర్ నటుడు మనోజ్ కుమార్ కన్నుమూత



బాలీవుడ్ సీనియర్ నటుడు, దర్శకుడు మనోజ్‌కుమార్ కన్నుమూశారు. ఆయన వయసు 87 సంవత్సరాలు. ముంబైలోని కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయన మరణానికి గల కారణం తెలియరాలేదు. మనోజ్ కుమార్ పలు విజయవంతమైన సినిమాల్లో నటించారు. 'పూరబ్ ఔర్ పాచిమ్', 'క్రాంతి', 'రోటీ, కపడా ఔర్ మకాన్' వంటి సినిమాలు ఆయనకు విశేషమైన గుర్తింపును తెచ్చిపెట్టాయి.దేశభక్తి చిత్రాల్లో ఎక్కువగా నటించడంతో ఆయనను 'భారత్ కుమార్' అని పిలుచుకునేవారు. ఒక జాతీయ చలనచిత్ర అవార్డు, ఏడు ఫిల్మ్‌ఫేర్ అవార్డులు అందుకున్నారు. నటుడిగానే కాకుండా దర్శకుడిగా, స్క్రీన్ రైటర్‌గా, పాటల రచయితగా, ఎడిటర్‌గా భిన్న పార్శ్వాలు కలిగిన వ్యక్తిగా మనోజ్ కుమార్ పేరు సంపాదించుకున్నారు. 1992లో భారత ప్రభుత్వం ఆయనను పద్మశ్రీ అవార్డుతో సత్కరించింది. అలాగే, 2015లో 'దాదాసాహెబ్ ఫాల్కే' అవార్డును అందుకున్నారు.



# బాలీవుడ్‌కు త్వరలోనే పూర్వ వైభవం

కొన్నేళ్లుగా బాలీవుడ్ తన ప్రాభవాన్ని కోల్పోతూ వస్తోంది. చెప్పుకోదగ్గ గొప్ప సినిమాలను బాలీవుడ్ అందించలేకపోతోంది. బాలీవుడ్ స్టార్లు కూడా పెద్ద హిట్లను సాధించలేక పోతున్నారు. ఇదే సమయంలో దక్షిణాది సినిమాలు ఉత్తరాదిని ఊపేస్తున్నాయి. ఈ క్రమంలో బాలీవుడ్ పై సొంత ఇండస్ట్రీలోని ప్రముఖులు కూడా విమర్శలు గుప్పిస్తున్నారు. తాజాగా టాలీవుడ్ హీరో విజయ్ దేవరకొండ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ బాలీవుడ్ పై కీలక వ్యాఖ్యలు చేశారు. బాలీవుడ్ ఇప్పుడు ఇబ్బందులను ఎదుర్కొంటోందని... త్వరలోనే పూర్వ వైభవాన్ని సాధిస్తుందని చెప్పారు. దక్షిణాది సినిమాలకు ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా విశేష ఆదరణ లభిస్తోందని అన్నారు. తెలుగు సినీ పరిశ్రమ ఈ స్థాయికి చేరుకోవడం వెనుక ఎంతో మంది శ్రమ, కృషి ఉందని చెప్పారు. ఉత్తరాది ప్రేక్షకులు ఇప్పుడు మన సినిమాలను చూసేందుకు ఆసక్తి చూపుతున్నారని... ఒకానొక సమయంలో మన సినిమాలకు ఉత్తరాదిన సరైన గుర్తింపు ఉండేది కాదని అన్నారు. బాలీవుడ్ లో ఇప్పుడు ఒక లోటు ఏర్పడిందని... ఆ లోటును కొత్త దర్శకులు తీరుస్తారని చెప్పారు. కాకపోతే ఆ దర్శకులు ముంబైకి సంబంధం లేకుండా బయటివారే అయి ఉంటారని అనిపిస్తోందని అన్నారు.



# సూపర్ ఛాన్స్ కొట్టేసిన శివానీ

స్టార్ హీరో ఆర్. మాధవన్ ప్రధాన పాత్రలో ఫేమస్ సైంటిస్ట్, ఇంజనీర్ గోపాలస్వామి దొరైస్వామి నాయుడు బయోపిక్ తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ మూవీకి సంబంధించిన ఓ ఇంట్రెస్టింగ్ న్యూస్ ప్రస్తుతం నెట్టింట చక్కర్లు కొడుతుంది. ఈ సినిమాలో ఓ కీలక పాత్ర కోసం టాలీవుడ్ సీనియర్ హీరో రాజశేఖర్ కూతురు శివానీ రాజశేఖర్ ను ఎంపిక చేసినట్టు తెలుస్తోంది.

జూన్ నుంచి శివానీ రాజశేఖర్ జీడీ నాయుడు మూవీ షూటింగ్ లో పాల్గొననున్నట్టు సమాచారం. ఈ సినిమాలో మాధవన్ తో కలిసి శివానీ స్క్రీన్ ను షేర్ చేసుకోనుంది. శివానీ గత సినిమాలను చూసిన దర్శకనిర్మాతలు ఈ పాత్రకు శివానీ అయితేనే న్యాయం చేస్తుందని భావించి ఆమెను ఎంపిక చేసినట్టు తెలుస్తోంది. జీడీ నాయుడు బయోపిక్ లో శివానీ పాత్ర ఎప్పటికీ గుర్తుండిపోతుందని, ఆమె కెరీర్లోనే ఈ సినిమా ఓ మైల్ స్టోన్ గా నిలుస్తుందని చెప్తున్నారు.ఎవడైతే నాకేంటి, సత్యమేవ జయతే, కల్కి సినిమాలకు నిర్మాతగా వ్యవహరించిన శివానీ తర్వాత 2 స్టేట్స్ మూవీతో హీరోయిన్ గా పరిచయమైన సంగతి తెలిసిందే. ఇప్పటికే తెలుగు, తమిళ భాషల్లో పలు సినిమాల్లో నటించి మెప్పించిన శివానీ ఇప్పుడు జీడీ నాయుడు బయోపిక్ లో మంచి ఛాన్స్ కొట్టేసింది. ఈ సినిమాకు కృష్ణకుమార్ రామకుమార్ దర్శకత్వం వహించనున్నారు.

ఇక గోపాలస్వామి దొరస్వామి నాయుడు కోయంబత్తూర్ లోని రైతు కుటుంబంలో పుట్టారు. ఆయన పెద్దగా చదువుకోకపోయినా ప్రయోగాలపై ఉన్న ఇంట్రెస్ట్ తో పలు రంగాల్లో తన సత్తా చాటి ఎన్నో గొప్ప ఆవిష్కరణలు చేశారు. ఇండియాలో ఎలక్ట్రిక్ మోటర్ ను కనిపెట్టింది ఈయనే. హోటల్ సర్వర్ గా కెరీర్ ను స్టార్ట్ చేసిన ఆయన ఎలక్ట్రిక్ ఫీల్డ్ లో విప్లవాన్ని సృష్టించారు. సొంతంగా ప్రయోగాలు చేస్తూ ఎన్నో ఆవిష్కరణలు చేసిన ఆయన్ను మిరాకిల్ మ్యాన్, ఎడిసన్ ఆఫ్ ఇండియా, వెల్త్ క్రియేటర్ ఆఫ్ కోయంబత్తూర్ అని పిలుచుకుంటూ ఉంటారు.ఇప్పుడు ఆయన బయోపిక్ ను తెరకెక్కిస్తుండగా అందులో మాధవన్ ప్రధాన పాత్ర పోషిస్తున్నాడు. ఆల్రెడీ గతంలో రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్ సినిమా ద్వారా నంబి నారాయణన్ జీవితాన్ని తెరకెక్కించి అందులో నటించి ఆ సినిమాకు నేషనల్ అవార్డు అందుకున్న మాధవన్, ఇప్పుడు జీడీ నాయుడు బయోపిక్ లో నటిస్తున్నాడు. ఈ సినిమాలో ప్రియమణి, యోగిబాబు, జయరాం కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

# బుచ్చిబాబుకు ప్రత్యేక బహుమతులు పంపిన రామ్ చరణ్





టాలీవుడ్ స్టార్ రామ్ చరణ్ 40వ ఏట అడుగుపెట్టారు. ఈ సందర్భంగా దర్శకుడు బుచ్చిబాబుకు చరణ్ ప్రత్యేక బహుమతులను పంపించారు. గిఫ్టులను పంపిస్తూ... ఒక లేఖను కూడా జోడించారు. 'బుచ్చి... హనుమాన్ చాలీసా నాకు జీవితంలో అత్యంత గొప్ప శక్తిని ఇచ్చింది. కఠిన సమయాల్లో సైతం హనుమాన్ పై నాకున్న నమ్మకం నన్ను నిలబెట్టింది. నేను 40వ సంవత్సరంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా ఆ శక్తిలో కొంత నీతో షేర్ చేసుకోవాలనుకుంటున్నా. నా జీవితంలో నీకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. నీవు ఎప్పుడూ బాగుండాలి. దేవుడి దీవెనలు నీకు ఉండాలి. ఇది కేవలం గిఫ్ట్ మాత్రమే కాదు. నీ మీద మాకున్న ప్రేమను చాటుతుంది' అని లేఖలో చరణ్ పేర్కొన్నారు. ఈ మేరకు చరణ్, ఉపాసన ఇద్దరూ గిఫ్ట్ పంపారు. చరణ్ దంపతులు పంపిన గిఫ్ట్ పై బుచ్చిబాబు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# ఇరాన్, కెనడా, హాకాంగ్ లో వీరమల్లు!




పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా నటిస్తోన్న హరిహర వీరమల్లు రిలీజ్ తేదీ ప్రకటించిన సంగతి తెలిసిందే. మే 9న రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా స్పీడందు కున్నట్లు కనిపిస్తుంది. పవన్ కళ్యాణ్ పై కొంత షూటింగ్ మినహా టాకీ అంతా పూర్తయింది. ఈ నేపథ్యంలో పోస్ట్ ప్రొడక్షన్ కూడా పెద్దగా గ్యాప్ తీసుకోకుండానే మొదలు పెట్టారు. పీరియాడిక్ సోషియో ఫాంటసీ చిత్రం కావడంతో సీజీ ఎక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో పోస్ట్ ప్రొడక్షన్ పనులు మూడు దేశాల్లో జరుగుతున్నట్లు తెలిసింది. ఇరాన్, కెనడా, హాకాంగ్ లో సీజీ పనులు జరుగుతున్నాయని యూనిట్ వర్గాల నుంచి తెలిసిందే. మూడు లోకేషన్లలో ఒకే కంపెనీకి ఈ బాధ్యతలు అప్పగించారట. ఒకో చోట ఏక కాలంలో ఒకేసారి సీజీ వీలుపడని నేపథ్యంలో వర్క్ ని ఇలా స్ప్లిట్ చేసినట్లు తెలుస్తోంది. అలాగే కొంత వర్క్ హైదరాబాద్ , చెన్నై స్టూడియోల్లో కూడా చేస్తున్నారుట. పవన్ కళ్యాణ్ సినిమాకి సంబంధించి ఇంతవరకూ ఏ సినిమాకు ఇన్ని దేశాల్లో సీజీ జరగలేదు. ఇప్పటి వరకూ ఆయన చేసిన చిత్రాలన్నీ రొటీన్ కమర్శియల్ చిత్రాలు కావడంతో ఆ ఛాన్స్ రాలేదు. వీరమల్లు పూర్తిగా పీరియాడిక్ స్టోరీ కావడంతో సీజీ కి ప్రాధాన్యత ఏర్పడింది. విజువల్ ఎఫెక్ట్స్ ఏ సినిమాకైనా కీలకం. యాక్షన్ సన్నివేశాల్లో సహజత్వాన్ని హైలైట్ చేసేది అదే. మరి వీరమల్లు లో యాక్షన్ సన్నివేశాలు ఎలాంటి అనుభూతిని పంచుతాయో చూడాలి. ఈ సినిమాకి ఇంకా పవన్ కళ్యాణ్ కొన్ని రోజులు డేట్లు ఇవ్వాల్సి ఉంది. ఆ పార్ట్ కి సంబంధించి షూటింగ్ పూర్తి చేయాలి. అవసరం మేర అక్కడా సీజీ వర్క్ ఉంటుంది. మరి పవన్ హెక్టిక్ షెడ్యూల్ నడుమ డేట్లు ఎప్పుడు కేటాయిస్తారో చూడాలి.

# 'ఎల్లమ్మ' కోసం వేణు బలగం ఫార్ములా



కమెడియన్‌గా మంచి పేరు తెచ్చుకున్నా ఆశించిన స్థాయిలో కమెడియన్‌గా గుర్తింపుని, సరైన అవకాశాల్ని వేణు దక్కించుకోలేకపోయాడు. అయితే నటుడిగా కన్నా %-%బలగం%-% సినిమాతో దర్శకుడిగా విశేషమైన గుర్తింపుతో పాటు ప్రేక్షకుల, విమర్శకుల ప్రశంసల్ని సొంతం చేసుకుని ప్రత్యేకతను చాటుకున్నాడు. ప్రియదర్శి, కావ్య కల్యాణ్‌రామ్, మురళీధర్‌గౌడ్ మినహా అంతా కొత్త వాళ్లతో వేణు తెరకెక్కించిన ఈ సినిమా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే.%వందకు పైగా ఇంటర్నేషనల్ అవార్డుల్ని దక్కించుకున్న ఈ సినిమాతో దర్శకుడిగా టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారిన %-%బలగం%-% వేణు ఈ మూవీ తరువాత మళ్లీ ఎలాంటి కథతో వస్తాడా? అని అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్న వేళ వేణు అందరిని సర్‌ప్రైజ్ చేస్తూ మరోసారి మట్టికథతో ఎల్లమ్మ%-% సినిమాని ప్రకటించడం తెలిసిందే. ముందు ఈ ప్రాజెక్ట్‌ని నేచురల్ స్టార్ నానితో చేయాలని ప్లాన్ చేశాడు. చర్చలు కూడా జరిగాయి. కానీ ఫైనల్‌గా ఈ ప్రాజెక్ట్ నుంచి నాని తప్పుకోవడంతో ఆ స్థానంలో నితిన్‌ని ఫైనల్ చేశారు.దిల్ రాజు అత్యంత భారీ స్థాయిలో నిర్మించడానికి రెడీ అవుతున్న ఈ ప్రాజెక్ట్ కోసం దర్శకుడు వేణు మళ్లీ %-%బలగం%-% ఫార్ములానే ఫాలోఅవుతున్నట్టుగా తెలుస్తోంది. %-%బలగం%-% సినిమా కోసం రంగస్థల కళాకారుల్ని తెరపైకి తీసుకొచ్చి శభాష్ అనిపించుకున్న వేణు %-%ఎల్లమ్మ%-% సినిమా కోసం కూడా ఇదే పంథాని అనుసరిస్తున్నట్టుగా తెలిసింది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ స్టేజ్‌లో ఉన్న ఈ ప్రాజెక్ట్ కోసం బలగం వేణు రంగస్థల కళాకారుల కోసం వేట మొదలుపెట్టినట్టుగా తెలిసిది.ఇప్పటికే తెలంగాణలోని పల్లెల్లో, నగరాల్లో పర్యటిస్తున్న వేణు సిరిసిల్ల, నిజామాబాద్‌లలోనూ పర్యటించాడట. ఇప్పటికే పలువురు రంగస్థల కళాకారుల్ని ఎంపిక చేసినట్టుగా తెలిసింది. వీరిని ప్రత్యేకంగా స్టేజ్ డ్రామాలు, వారి నటనను పరిశీలించాకే వేణు ఎంపిక చేసినట్టుగా చెబుతున్నారు. ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ త్వరలోనే ప్రారంభం కాబోతోంది. రంగస్థల కళాకారులని తీసుకుని %-%బలగం%-%తో మ్యాజిక్ చేసిన వేణు మళ్లీ అదే ఫార్ములాతో %-%ఎల్లమ్మ%-%తోనూ అదే మ్యాజిక్‌ని రిపీట్ చేస్తాడా? అన్నది వేచి చూడాల్సిందే.